



# అక్షర రేఖ

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Adilabad

RNI NO. TELTEL/2012/44706

ఆదివారం 17 మే 2026 | Akshara Rekha Telugu Daily | వెల : 3/- | సంపుటి : 15 | సంచిక : 3 | పేజీలు : 8

# కేబినెట్ రీ లోడింగ్ టెన్షన్

- ముఖ్యమంత్రి తన కేబినెట్‌ను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు
- కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు ఆధారంగా మంత్రుల శాఖలను మార్చడం లేదా కొందరిని తప్పించడం వంటి కఠిన నిర్ణయాలు హైకమాండ్ తీసుకోబోతోందని తెలుస్తోంది
- దీంతో రాష్ట్ర మంత్రుల్లో ఒకరకమైన అభద్రతా భావం, ఉత్కంఠ నెలకొన్నాయి
- ప్రభుత్వ పనితీరును పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో అధిష్టానం ఇప్పటికే మంత్రులందరి ప్రగతి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం
- కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల పాలనాపరమైన జాప్యం జరుగుతోందన్న విమర్శలను చెరిపివేసేందుకు పూర్తి స్థాయి క్యాబినెట్ దిశగా అడుగులు పడుతున్నాయి



హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి కళ్లు సచివాలయం వైపే ఉన్నాయి. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి తన కేబినెట్‌ను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు ఆధారంగా మంత్రుల శాఖలను మార్చడం లేదా కొందరిని తప్పించడం వంటి కఠిన నిర్ణయాలు హైకమాండ్ తీసుకోబోతోందని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర మంత్రుల్లో ఒకరకమైన అభద్రతా భావం, ఉత్కంఠ నెలకొన్నాయి. ప్రభుత్వ పనితీరును పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో అధిష్టానం ఇప్పటికే మంత్రులందరి ప్రగతి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా - మిగతా3లో



# బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు జారీ

- స్నేహితులు, బంధువుల ఇళ్లపై నిఘా
- బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు జారీ
- భగీరథ్‌తో టచ్‌లో ఉన్నవారిపై పోలీసుల నిఘా
- భగీరథ్ స్నేహితులు, బంధువుల ఇళ్లపై నిఘా

హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతం చేశారు. పరారీలో ఉన్న బండి భగీరథ్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. అతను దేశం దాటి పోకుండా లుక్ అవుట్ నోటీసులు - మిగతా3లో

## పోలీసుల ఎదుట లొంగిపోయిన బండి భగీరథ్

- పోలీసులకు అప్పగించాం: బండి సంజయ్
- బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశాం: సీపీ

## చరిత్రలో ఉంటారో లేదో పాక్ నిర్ణయించుకోవాలి



- దాయాది దేశానికి భారత ఆర్మీ చీఫ్ స్ట్రాంగ్ వార్నింగ్
- అమాయక పర్యాటకులపై పహల్గాంలో గతేడాది ఉగ్రదాడి
- ఈ క్రమంలో పాక్‌కు ఆపరేషన్ సిందూర్‌తో ధీటుగా బదులిచ్చిన ఇండియా

## బొద్దింకల్లా మారిన నిరుద్యోగులు



- తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన సీజేఐ
- ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలపై దుమారం
- వాటిపై వివరణ ఇచ్చిన సీజేఐ
- తన వ్యాఖ్యలను వక్రీకరించారని వెల్లడి


# తెలంగాణలో మూడు రోజుల్లో వర్షాలు

- 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- తెలంగాణకు వర్ష సూచన
- శని, ఆదివారాల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ
- ఈనెల 26న రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందన్న వాతావరణశాఖ



హైదరాబాద్

రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో ఒకటి లేదా రెండు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తాయని వాతావరణశాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. ఆ ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, నారాయణపేట్?లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో రానున్న రెండు, మూడు రోజుల్లో పలుచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని ఐఎండీ అధికారి - మిగతా3లో



## డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ టాప్

- ప్రజాస్వామ్యానికి మనది మాతృదేశం: ప్రధాని మోదీ
- ది హేగ్‌లో ప్రవాస భారతీయులతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం
- భారత్, నెదర్లాండ్స్ కలిసి భవిష్యత్ సరఫరా వ్యవస్థపై దృష్టి
- సెమీకండక్టర్ తయారీలో భారత్ కీలక ముందడుగు వేసిందన్న మోదీ

# దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది



- పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే
- పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సమర్థనీయం కాదన్న రేవంత్‌రెడ్డి
- ఇంధన ధరల పెంపు వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావమని వ్యాఖ్య
- మోదీ ప్రభుత్వ నిర్ణయం వల్ల నిత్యావసరాల ధరలకు రెక్కలు
- మోదీ సర్కార్ అసమర్థ పాలన, అనాలోచిత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది

హైదరాబాద్

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సామాన్యుల పాలిట పిడుగుపాటులా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు పెరుగుతాయని, అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం పడుతుందన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మోదీ సర్కార్ అసమర్థ పాలన, అనాలోచిత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని, యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందని - మిగతా3లో

## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

- లేకుంటే మోదీ బాధ్యత వహించాలి
- 'నీట్' లీకేజీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి భారత విద్యా వ్యవస్థను నాశనం చేశాయి
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలి



## జూన్ 15 నుంచి తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ

- సీఈవో సుదర్శన్‌రెడ్డి
- వచ్చే నెల 15 నుంచి రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలవుతుందన్న సీఈవో సుదర్శన్ రెడ్డి
- జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేస్తామని వెల్లడి



హైదరాబాద్

ఓటరు జాబితాలో అనర్హులు లేకుండా చూడటం, అర్హులకు చోటు కల్పించడమే సర్ (ఎస్ఐఆర్) ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 25 ఏళ్ల తర్వాత సర్ ప్రక్రియ జరగబోతున్నారు. వచ్చే 15 నుంచి ప్రారంభమయ్యే సర్ ప్రక్రియ వివరాలను ఆయన హైదరాబాద్‌లో వెల్లడించారు. - మిగతా3లో



## సీబీఎస్ఈ కీలక నిర్ణయం 9, 10 తరగతుల్లో మూడు భాషల విధానం

- సీబీఎస్ఈలో 2026 జులై 1 నుంచి కొత్త నిబంధనలు అమలు
- త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ
- 10వ తరగతికి మాత్రం మినహాయింపు ఇచ్చిన బోర్డు
- మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు ఉండాలని నిబంధన

# చరిత్రలో ఉంటారో లేదో పాక్ నిర్ణయించుకోవాలి



పొరుగు దేశం పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, భారత్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు కొనసాగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఒకవేళ టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పించి భారత్‌పై ప్రయోగిస్తే చరిత్రలో ఉంటారో లేదో పాక్ డిసైడ్ చేసుకోవాలని అన్నారు. దిల్లీలోని మానెక్ షా సెంటర్‌లో 'యూనిఫామ్ అన్‌వీల్డ్' నిర్వహించిన ఒక ఇంటరాక్టివ్ సెషన్‌లో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పాల్గొన్నారు. గతేడాది ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులు మళ్లీ తలెత్తితే భారత సైన్యం ఎలా స్పందిస్తుందని ఆయనను ప్రశ్నించగా ధీటుగా బదులిచ్చారు.

**ఆపరేషన్ సిందూర్ వార్షికోత్సవం పూర్తి చేసుకున్న వేళ వ్యాఖ్యలు**

పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఇటీవలే ఏడాది పూర్తైంది. ఆపరేషన్ సిందూర్ మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకున్న కొద్ది రోజుల తర్వాత సేనా సంవాద్ కార్యక్రమంలో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం పెంచి పోషిస్తే ఊరుకోబోమని పాకిస్థాన్‌కు గట్టి సందేశాన్ని ఇచ్చారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశ వైఖరిని పునరుద్ఘాటించారు.

**'అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ సిందూర్'**

అయితే గతంలోనూ ఆపరేషన్ సిందూర్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది. ఆపరేషన్ సిందూర్ త్రివిధ దళాల సమన్వయానికి నిదర్శనమని కొనియాడారు. భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధత ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలు చేశామని చెప్పారు. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో భారత త్రివిధ దళాలు అత్యంత సమర్థవంతంగా పనిచేశాయని గుర్తు చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ద్వారా పాక్, పీఓకేలోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేయగలిగామని పేర్కొన్నారు. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చామని వెల్లడించారు. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించామని వివరించారు. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా అప్పట్లో తాము పూర్తి సన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నా, ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార దాడి**

కాగా, గతేడాది జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యటకులపై ముష్కరులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ కాల్పుల్లో 26 మంది టూరిస్టులు మరణించారు. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా గతేడాది మే 7వ తేదీ తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది భారత్. పాకిస్థాన్, పీఓకేలోని పలు ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు చేసింది. దాదాపు 100మంది ముష్కరులను మట్టుబెట్టింది. దీంతో భారత్- పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక స్థావరాలు, పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడులకు ప్రయత్నించింది. ఆ దాడులను భారత్ సమర్థవంతంగా అడ్డుకుంది. తీవ్ర ప్రతిదాడులకు దిగి పాక్‌కు చుక్కలు చూపించింది. అత్యంత కచ్చితత్వంతో పాక్‌లోని దాదాపు డజను సైనిక స్థావరాలను నేలమట్టం చేసింది. అందులో పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ ఉన్న చక్లాలలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌తో పాటు సర్గోదా, భోలారీ వైమానిక స్థావరాలు కూడా ఉన్నాయి. దాడుల్లో అవి ధ్వంసమైన తీరు ఉపగ్రహ చిత్రాల్లో కనిపించింది. ఆ తర్వాత మే 10న ఇరు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)ల మధ్య ప్రత్యక్ష చర్చలు జరిగాయి. దీంతో భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గాయి. అయినప్పటికీ పలు వేదికలపై భారత్‌పై యుద్ధంలో తామే గెలిచామని పాక్ ప్రగల్భాలు పలికింది. వాటిని కూడా భారత అధికారులు సమర్థంగా తిప్పికొట్టారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి



'నీట్' ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్? చేశారు. లేకుంటే ఈ ఘోర వైఫల్యానికి ప్రధాని మోదీ స్వయంగా వ్యక్తిగత బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. లీక్ కారణంగా 22 లక్షల మంది నీట్ అభ్యర్థుల శ్రమ వృథా అయ్యిందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి భారత విద్యా వ్యవస్థను నాశనం చేశాయని ఆరోపించారు. నీట్? పరీక్షకు రెండు రోజుల ముందే ప్రశ్నపత్రం వాట్సాప్‌లో చలామణి అయిన విషయం దేశం మొత్తానికి తెలుసునని, అయితే ఈ విషయం తమకు తెలియదన్నట్లు ధర్మేంద్ర ప్రధాన్ అంటున్నారని ఆయన మండిపడ్డారు. అయితే, తప్పు జరిగిన ప్రతిసారి పేపర్ లీక్ మాఫియా ఎటువంటి శిక్షల్లేకుండా తప్పించుకుంటుంటే, నిజాయతీపరులైన విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

**'విద్యార్థులు నష్టపోతుంటే మోదీ మాత్రం మౌనంగా ఉన్నారు'**

కేవలం సంపాదన కోసమే ఉన్నత విద్యా సంస్థల్లో తమకు అనుకూలమైనవారిని నియమిస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. దేశంలో 80సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని, సుమారు 2కోట్ల మంది భవిష్యత్ అంధకారంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతమంది విద్యార్థులు నష్టపోతుంటే ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. లీక్ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

"నిజం ఏమిటంటే బీజేపీ నేతలు, యూనివర్సిటీ అధికారులు కుమ్మక్కై దేశ విద్యా వ్యవస్థను దెబ్బతీశారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా విశ్వవిద్యాలయాల్లో వైస్? ఛాన్సలర్లుగా, ప్రొఫెసర్లుగా నియామకం అయిన వ్యక్తులతో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పరచుకున్న కూటమి ఇది. ఏదైనా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ కావాలంటే, సబ్జెక్టు పరిజ్ఞానం గానీ, అనుభవం కానీ అవసరం లేదు. కేవలం ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉంటే సరిపోతుందని దేశం మొత్తానికి తెలుసు. మీ సిద్ధాంతం ఆర్?ఎస్?ఎస్? సిద్ధాంతానికి అనుగుణంగా లేకపోతే మీరు వైస్ ఛాన్సలర్ కాలేరు" అని గాంధీ ఆరోపించారు.

**'విద్యార్థులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం'**

ఇదిలా ఉండగా, నీట్-యూజీ పునఃపరీక్ష జూన్ 21న జరుగుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్? పేర్కొన్నారు. పేపర్? లీక్? వివాదం దృష్ట్యా వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్ష కంప్యూటర్ ఆధారితంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఒక పత్రికా సమావేశంలో మంత్రి ధర్మేంద్ర మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు అత్యంత ప్రాధానమైన అంశమని, అది బాగుండేలా చూడటమే తమ మొదటి లక్ష్యమని ఆయన అన్నారు. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. నీట్-యూజీ నిర్వహణలో ఎలాంటి అవకతవకలు బయటపడినా అస్సలు సహించమని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించామని ఆయన చెప్పారు. అయితే, భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా, పేపర్? లీక్? వ్యవహారానికి సంబంధించి సీబీఐ అధికారులు ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేశారు.

# డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ టాప్



నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన సమావేశంలో భారత పురోగతి, ప్రపంచ సవాళ్లు, భారత్- నెదర్లాండ్స్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపించిందని ప్రధాని వ్యాఖ్యానించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా అక్కడి భారతీయుల కృషి, ప్రతిభ గురించి ఎంతో ప్రశంసిస్తారని చెప్పారు. నెదర్లాండ్స్ ఆర్థిక వ్యవస్థకు భారతీయులు అందిస్తున్న సేవలపై ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడన్నారు. ది హేగ్ నగరం భారత్- నెదర్లాండ్స్ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. ఎన్నో కష్టాలను దాటుకుని అక్కడ స్థిరపడిన భారతీయ కుటుంబాల కథలు కేవలం వలసల కథలు కాదని, అవి అభివృద్ధి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకలని అన్నారు. తరాలు మారినా, దేశాలు మారినా భారతీయ కుటుంబ విలువలు, సంస్కృతి మారలేదని కొనియాడారు. డచ్ భాషను స్వీకరించినా తమ మూల భాషలను, సంప్రదాయాలను ప్రవాస భారతీయులు వదల్లేదని అభినందించారు.

**ఫలితాలు చెదిరిపోయే ప్రమాదం!**

ప్రపంచం ప్రస్తుతం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని ప్రధాని మోదీ అన్నారు. ముందుగా కరోనా మహమ్మారి వచ్చిందని, ఆ తర్వాత యుద్ధాలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ఇంధన సంక్షోభం ప్రపంచాన్ని వేధిస్తోందని తెలిపారు. ఈ దశకం ప్రపంచానికి డిజాస్టర్ల దశకంగా మారుతోందని వ్యాఖ్యానించారు. పరిస్థితులు త్వరగా మారకపోతే గత ఎన్నో దశాబ్దాల అభివృద్ధి ఫలితాలు చెదిరిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ జనాభాలో పెద్ద వర్గం పేదరికంలోకి జారిపడే పరిస్థితి రావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు రెసిలియెంట్ సప్లై చైన్‌పై దృష్టి పెడుతున్నాయని ప్రధాని తెలిపారు. భారత్, నెదర్లాండ్స్ కలిసి విశ్వసనీయమైన, పారదర్శకమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సరఫరా వ్యవస్థను రూపొందించేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం కోసం రెండు దేశాలు భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని వెల్లడించారు. 21వ శతాబ్దంలో భారత్ అవకాశాల భూమిగా ఎదుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఒకేసారి టెక్నాలజీ ఆధారిత దేశంగా, మానవీయ విలువలను కాపాడే దేశంగా ముందుకు సాగుతోందన్నారు. భారత్ ఎంత పురాతనమో, అంత ఆధునికంగా కూడా మారుతోందని వ్యాఖ్యానించారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం దేశంలో నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. స్టార్టప్ రంగంలోనూ భారత్ వేగంగా ఎదుగుతోందని, ఒకప్పుడు కేవలం నాలుగు యూనికార్న్ కంపెనీలు మాత్రమే ఉండగా ఇప్పుడు 100కు పైగా ఉన్నాయని వెల్లడించారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధాని స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటికే సెమీకండక్టర్ ప్లాంట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలో మేడ్ ఇన్ ఇండియా చిప్‌లు ప్రపంచ మార్కెట్లలో కనిపిస్తాయని తెలిపారు. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకెళ్తోందన్నారు.

**ప్రపంచానికి ప్రజాస్వామ్యానికి భారత్ మాతృదేశం**

అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ పెరుగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను భారత్ విజయవంతంగా నిర్వహించగలిగిందని పేర్కొన్నారు. ప్రపంచ సమస్యల పరిష్కారంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భారత ప్రజాస్వామ్య బలం గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. ప్రస్తుతం దేశంలో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారని వెల్లడించారు. ఈయూ దేశాల మొత్తం జనాభాను కలిపినా 64 కోట్ల మంది ఉండరంటూ భారత ప్రజాస్వామ్య విస్తృతిని వివరించారు. ప్రపంచానికి ప్రజాస్వామ్యానికి భారత్ మాతృదేశమని పేర్కొన్నారు. మే 16 తేదీ తన జీవితంలో ప్రత్యేకమని ప్రధాని గుర్తు చేసుకున్నారు. 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దేశంలో స్థిరమైన మెజార్టీ ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ప్రజల విశ్వాసమే తనకు అతిపెద్ద బలం అని పేర్కొన్నారు. 'నేను 'నేను' నుంచి 'మనము' అనే మార్గాన్ని ఎంచుకున్నాను. మీ సంతోషమే నా సంతోషం, మీ అభివృద్ధే నా బాధ్యత' అని అన్నారు. 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు ప్రధానమంత్రిగా ప్రజల మద్దతు పొందడం తన అదృష్టమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కోట్లాది భారతీయుల ఆశీర్వాదమే తనకు శక్తినిస్తోందని తెలిపారు.

## సీబీఎస్ఈ కీలక నిర్ణయం: 9, 10 తరగతుల్లో మూడు భాషల విధానం



సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కీలక నిర్ణయం తీసుకుంది. 9, 10 తరగతుల విద్యార్థులకు త్రిభాషా అధ్యయనాన్ని తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. 2026 జులై 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. విద్యార్థులు చదివే మూడు భాషల్లో కనీసం రెండు భారతీయ భాషలే ఉండాలని స్పష్టం చేసింది. ఈ కొత్త ఈ విధానం వల్ల విద్యార్థులపై ఎలాంటి అదనపు పరీక్షల భారం పడకుండా ఉండేందుకు సీబీఎస్ఈ మినహాయింపును కూడా ఇచ్చింది. 10వ తరగతి బోర్డు పరీక్షల సమయంలో మూడో భాషకు ఎలాంటి బోర్డు పరీక్ష ఉండదని స్పష్టం చేసింది. సీబీఎస్ఈ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం, 9వ తరగతి నుంచి విద్యార్థులు మూడు భాషలను చదవాల్సి ఉంటుంది. వాటిని ఆర్1, ఆర్2, ఆర్3గా సీబీఎస్ఈ బోర్డు పేర్కొంది. ఇందులో రెండు భాషలు తప్పనిసరిగా భారతీయ మాతృభాషలై ఉండాలి. విదేశీ భాషలను మూడో భాషను మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంటుంది. అదనంగా నాలుగో ఐచ్ఛిక భాషగా కూడా విదేశీ భాషలను తీసుకునే వీలుంటుందని సీబీఎస్ఈ తెలిపింది. జాతీయ విద్యా విధానం 2020, నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సిఫార్సులను అమలులో భాగంగా సీబీఎస్ఈ ఈ నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. అయితే, తొమ్మిదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చేవరకు వారు ఎంచుకున్న మూడో భాష కోసం ప్రస్తుతానికి 6వ తరగతికి చెందిన పాఠ్యపుస్తకాలనే ఉపయోగించాలని తెలిపింది. స్థానిక లేదా రాష్ట్రస్థాయికి చెందిన పద్యాలు, చిన్న కథలు, నవలలు వంటి సాహిత్య అంశాలను అదనంగా చేర్చి బోధించాలని స్పష్టం చేసింది. జూన్? 15 నాటికి మార్గదర్శకాలు విడుదల చేస్తామని సీబీఎస్ఈ ప్రకటించింది. 19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి మూడో భాష పాఠ్య పుస్తకాలను జులై 1లోపు అందుబాటులోకి తెస్తామని స్పష్టంచేసింది. మూడో భాషకు సంబంధించిన మూల్యాంకనం స్కూల్ స్థాయిలోనే జరుగుతుందని, ఆ మార్కులను సీబీఎస్ఈ సర్టిఫికెట్‌లో పొందుపరుస్తామని తెలిపింది. జాతీయ విద్యావిధానం మార్గదర్శకాలతోపాటు విద్యార్థులకు బహుభాషలపై అవగాహన కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీబీఎస్ఈ ప్రకటించింది.

**ఉపాధ్యాయుల కొరతపై ప్రత్యామ్నాయ మార్గాలు**

అలాగే, భాషా ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు కూడా సీబీఎస్ఈ పలు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. సమీప పాఠశాలలతో ఉపాధ్యాయుల భాగస్వామ్యం, వర్చువల్ క్లాసులు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల సేవలు, అర్హత కలిగిన పోస్ట్ గ్రాడ్యుయేట్ల నియామకం వంటి తాత్కాలిక చర్యలు చేపట్టవచ్చని పేర్కొంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు (సీడబ్ల్యూఎస్ఎన్), విదేశాల్లో ఉన్న సీబీఎస్ఈ పాఠశాలలు, విదేశాల నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక సడలింపులు ఉంటాయని సీబీఎస్ఈ ప్రకటించింది. ఇక, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) సిఫార్సులకు అనుగుణంగా, సీబీఎస్ఈ ఈ ఏడాది నుంచే 10వ తరగతి విద్యార్థులకు రెండు బోర్డు పరీక్షలను ప్రవేశపెట్టింది. మొదటి పరీక్ష ఫిబ్రవరి-మార్చిలో, రెండోది మే నెలలో జరపాలని నిర్ణయించారు. అయితే, మొదటి పరీక్షకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఈసారి భారతదేశవ్యాప్తంగా 8,074 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 24.71 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. 93.70 శాతానికి పైగా విద్యార్థులు 10వ తరగతి బోర్డు పరీక్షలో ఉత్తీర్ణులు కాగా, వీరిలో 55,000 మందికి పైగా 95 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారు

## బొద్దింకల్లా మారిన నిరుద్యోగులు

నిరుద్యోగులు బొద్దింకల్లా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారని తాను చేసిన వ్యాఖ్యలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. మీడియాలోని ఒక వర్గం తన మౌఖిక వ్యాఖ్యలను వక్రీకరించి, దేశ యువతపై విమర్శలుగా తప్పుగా చిత్రీకరించిందని అన్నారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో లాయర్ వంటి వృత్తులలోకి ప్రవేశించిన వారినుద్దేశించి తాను ఆ వ్యాఖ్యలు చేశానని చెప్పారు. దేశ యువత పట్ల తాను ఎంతగానో గర్వపడుతున్నానని వెల్లడించారు. ఓ కేసు విచారణ సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యల వివాదస్పదం కావడంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. "శుక్రవారం ఒక కేసు విచారణ సందర్భంగా నేను చేసిన మౌఖిక వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరు చదివి నేను బాధపడ్డాను. నకిలీ, బోగస్ డిగ్రీలతో లాయర్ వంటి వృత్తిలలోకి ప్రవేశించిన వారిని నేను ప్రత్యేకంగా విమర్శించాను. అలాంటి వ్యక్తులే మీడియా, సోషల్ మీడియా, ఇతర ఉన్నత వృత్తులలోకి కూడా చొరబడ్డారన్నాను. అలాంటివారిని పరాన్నజీవులతో పోల్చాను. నేను మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారం. దేశ యువత పట్ల నేను గర్వపడుతున్నాను. వారిని అభివృద్ధి చెందిన దేశానికి మూలస్తంభాలుగా భావిస్తున్నాను. దేశంలోని యువత నాకు స్ఫూర్తినిస్తుంది. భారత యువతకు నా పట్ల గొప్ప గౌరవం, మర్యాద ఉన్నాయని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. సీనియర్ న్యాయవాదుల హోదాకు సంబంధించిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయడంలో దిల్లీ హైకోర్టు జాప్యం చేస్తోందని, ధిక్కార చర్యలు తీసుకోవాలని లాయర్ సంజయ్ దుబే దేశ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారణకు నిరాకరించింది సుప్రీంకోర్టు. సీనియర్ అడ్వకేట్ హోదా అనేది కోర్టు ప్రసాదించే విశిష్ట గౌరవమని తెలిపింది. పిటిషన్ల ద్వారా దానిని సాధించుకోలేరని వెల్లడించింది. ఈ సీనియర్ అడ్వకేట్ హోదాను పొందడానికి ఎవరైనా అర్హులు గానీ, మీరొక్కరు (పిటిషనర్‌నుద్దేశించి) తప్ప అని వ్యాఖ్యానించింది. ఒకవేళ దిల్లీ హైకోర్టు పిటిషనర్‌కు సీనియర్ అడ్వకేట్ హోదాను ఇచ్చినా, తాము దాన్ని రద్దు చేస్తామని పేర్కొంది. అలాగే పిటిషనర్ సామాజిక మాధ్యమం వేదికగా వాడిన భాషను తప్పుపట్టింది.

**'వ్యవస్థపై దాడి చేసే పరాన్నజీవులు సమాజంలో ఇప్పటికే ఉన్నారు'**

ఈ క్రమంలో పిటిషనర్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమాజంలో కొంత మంది బొద్దింకల్లా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాల్లేని యువత సోషల్ మీడియా, ఆర్‌టీఐ కార్యకర్తలుగా మారి, వ్యవస్థపై దాడి చేస్తున్నారంటూ మండిపడ్డారు. వ్యవస్థపై దాడి చేసే పరాన్నజీవులు సమాజంలో ఇప్పటికే ఉన్నారని అన్నారు. వారితో చేతులు కలపాలనుకుంటున్నారా అంటూ పిటిషనర్‌ను ప్రశ్నించారు. సీనియర్ అడ్వకేట్ హోదా అనేది ఒక న్యాయవాదికి ఇచ్చే గుర్తింపు మాత్రమేనని, దానిని దూకుడుగా వెంబడించాల్సిన అవసరం లేదని అన్నారు. సీనియర్ అడ్వకేట్ హోదా అలంకారప్రాయంగా ఉంచుకోవాల్సిన హోదా చిహ్నంగా మారిందా అని ప్రశ్నించారు. ఈ విచారణ సమయంలో పిటిషనర్ కోర్టుకు క్షమాపణలు కోరారు. తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరారు. అందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం అనుమతిచ్చింది. దీంతో తన పిటిషన్‌ను సంజయ్ దుబే వెనక్కి తీసుకున్నారు.

**సోషల్ మీడియా పోస్టులపై ఆగ్రహం**

అలాగే న్యాయవ్యవస్థపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపైనా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. న్యాయవ్యవస్థే టార్గెట్ లక్ష్యంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు తమ దృష్టిలో ఉన్నాయని, వాటిని గమనించడం లేదని అనుకుంటున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీకి చెందిన కొందరు న్యాయవాదుల లా డిగ్రీల ప్రామాణికతపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో సీబీఐ విచారణకు ఆదేశించేందుకు తగిన కేసు కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. అలాంటి వారిపై బార్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు.

# దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది

-మొదటిపేజీ తరువాయి

దుయ్యబట్టారు. పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందన్నారు.

**తక్షణమే ఇంధన ధరలు తగ్గించాలని డిమాండ్**

ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం, ధరల పెంపును ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల ముందు ధరలు పెంచమని పదే పదే చెప్పి, ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవక ముందే బాదుడు మొదలు పెట్టారని ధ్వజమెత్తారు. పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. "నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని ఈ నిర్ణయం అనేక రంగాల పై వ్యతిరేక ప్రభావం చూపుతుందని" సీఎం రేవంత్?రెడ్డి అన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగి



సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుంది. మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆత్మ నిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదు అన్నది తేలిపోయింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలింది. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోంది. ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరింది. ఈ పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే. ప్రపంచంలో భారత్?ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుంది!? అని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం "పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం" అని పదే పదే ప్రకటించింది. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారు. ఇది విశ్వాస ఘాతుకం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాను" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# తెలంగాణలో మూడు రోజుల్లో వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

ధర్మరాజు తెలిపారు. 26న కేరళం తీరాన్ని తాకనున్న రుతుపవనాలు : ఈ నెల 26వ తేదీన నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళం తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి ధర్మరాజు తెలిపారు. ఇవాళ ఆగ్నేయ అరేబియన్ సముద్రంలో కొన్ని ప్రాంతాలు, నైరుతి బంగాళాఖాతంలోని చాలా ప్రాంతాలు అండమాన్ నికోబార్ దీవులలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లుగా వెల్లడించారు.

నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడుతుందని దీనికి అనుబంధంగా ఉన్న చక్రవాత ఆవర్తనం సగటు సముద్రమట్టం నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తువరకు కొనసాగుతుందని ఐఎండీ తెలిపింది. హైదర్షబాద్?లో పగటి పూట ఉష్ణతీవ్రత పెరుగుదలతో పాటు రాత్రిపూట నమోదయ్యే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సుమారు 30 డిగ్రీల వరకు నమోదవుతున్నాయని పేర్కొంది. దీనివల్ల అసౌకర్యమైన వాతావరణ పరిస్థితి, వేడిమి వాతావరణం, ఉక్కపోత లాంటి పరిస్థితి ఉంటుందని వివరించారు. ఎక్కువ జనసాంద్రత కలిగినటువంటి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్ర తలు పెరుగుతున్నాయని తెలిపారు. ఆదిలాబాద్, మెదక్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చెప్పారు.

**నెల చివరలో వడగాలులు వీచే అవకాశం**

ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లుగా వాతావరణ అధికారి ధర్మరాజు వెల్లడించారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41-44 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లుగా తెలిపారు. నెలాఖరుకి





ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వడగాల్పులు వీస్తాయని వివరించారు. వడదెబ్బ నుంచి కాపాడుకునేందుకు ప్రజలు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

ఎండతీవ్రత ఎక్కువగా ఉదయం 11 గంటల తర్వాత, 4 గంటల వరకు కొనసాగుతుందని కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్?, ఆసిఫాబాద్?, నిర్మల్, నిజామాబాద్, మెదక్?లలో అధిక ఉష్ణతీవ్రతలు కొనసాగుతాయని ఐఎండీ తెలిపింది. రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉందన్నారు. వీటికి సంబంధించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా వడదెబ్బకు గురికాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. "రాష్ట్రంలో ఒకటి రెండు జిల్లాల్లో ఇవాళ, రేపు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పలుచోట్ల కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి రెండు నుంచి మూడు డిగ్రీలు పెరుగుతాయని అంచనాలున్నాయి. శని, ఆదివారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో రుములు మెరుపులతో పాటు 30 నుంచి 40 కి.మి. వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈనెల 26 నాటికి రుతుపవనాలు కేరళం తీరాన్ని తాకే అవకాశం ఉంది"

# కేబినెట్ రీ లోడింగ్ టెన్షన్...

-మొదటిపేజీ తరువాయి

కీలకమైన రెవెన్యూ, హోం, విద్యుత్ వంటి శాఖల పనితీరుపై మిశ్రమ స్పందన వస్తోంది. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి, ఎన్నికల హామీల అమలులో వేగం పెంచడానికి సమర్థులైన వారికి కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం భావిస్తున్నారు. కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల పాలనాపరమైన జాప్యం జరుగుతోందన్న విమర్శలను చెరిపివేసేందుకు పూర్తి స్థాయి క్యాబినెట్ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ పునర్వ్యవస్థీకరణ వార్త సీనియర్ మంత్రులను కలవరపెడుతోంది. తాము గత 30 నెలలుగా ఒక శాఖపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని గాడిలో పెట్టామని, ఇప్పుడు శాఖ మార్చితే మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని కొందరు సీనియర్లు వాదిస్తున్నారు. తమ శాఖలను మార్చవద్దని ఇప్పటికే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం ప్రాధాన్యత లేని శాఖల్లో ఉన్న మంత్రులు మాత్రం తమకు ఈసారైనా మెరుగైన బాధ్యతలు దక్కుతాయని ఆశగా ఉన్నారు. ముఖ్యంగాయాక్టివ్‌గా ఉంటూ పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న వారికి ప్రమోషన్ దక్కే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రక్షాళనలో కేవలం పనితీరు మాత్రమే కాకుండా రాజకీయ, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేసే క్రమంలో సామాజిక



సమతుల్యతను పాటించాల్సి ఉంటుంది. ఏఐసిసి ఇచ్చే లీకులు, కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే తుది జాబితా ఉంటుందని స్పష్టమవుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు పదవీ గండం పొంచి ఉందనే ప్రచారం వారిలో నిద్రలేకుండా చేస్తోంది. మొత్తానికి తెలంగాణ కేబినెట్ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ అనేది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పు మాత్రమే కాదు, ఇది రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే ఒక వ్యూహాత్మక చర్య. ఒకవైపు పదవులు ఊడతాయనే వణుకు, మరోవైపు కొత్త శాఖలు దక్కుతాయనే ఆశల మధ్య తెలంగాణ రాజకీయం ఇప్పుడు వెయిట్ అండ్ వాచ్ మోడ్‌లోకి వెళ్లిపోయింది. హైకమాండ్ తీసుకునే నిర్ణయం ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాన్ని ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

## పోలీసుల ఎదుట లొంగిపోయిన బండి భగీరథ్

**హైదరాబాద్:** పేట్‌బషీరాబాద్‌లో నమోదైన పోక్సో కేసులో బండి భగీరథ్.. పోలీసుల ఎదుట లొంగిపోయారు. అడ్వకేట్ల సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. శనివారం రాత్రి లాయర్ల సమక్షంలో బండి భగీరథ్‌ను కుటుంబ సభ్యులే పోలీసులకు అప్పగించారు. కాసేపట్లో బండి భగీరథ్‌ను జడ్జి ముందు హాజరు పరిచే అవకాశం ఉంది.

**పోలీసులకు అప్పగించాం: బండి సంజయ్**

'చట్టంపైన గౌరవంతోనే మా అబ్బాయిని పోలీసులకు అప్పగించా. ఏ తప్పు చేయలేదని మా అబ్బాయి చెబుతున్నాడు. ఆధారాలను చూపేందుకే పోలీసులకు అప్పగింతలో జాప్యం జరిగింది' అని పేర్కొన్నారు బండి సంజయ్.

తనకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని, అందుచేత ఏ తప్పూ చేయని తన కుమారుడు పోలీసులకు లొంగిపోయాడన్నారు బండి సంజయ్. చట్టం ముందు అంతా సమానమేనని, ప్రతీ ఒక్కరూ చట్టాన్ని గౌరవించాల్సిందేనని బండి సంజయ్ స్పష్టం చేశారు.

**బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశాం: సీపీ**

బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశామని సైబరాబాద్ సీపీ రమేష్‌రెడ్డి స్పష్టం చేశారు. భగీరథ్‌ను గాలించే క్రమంలో అరెస్ట్ చేశామన్నారు. నార్సింగ్‌లోని పోలీస్ అకాడమీ వద్ద భగీరథ్‌ను అరెస్ట్ చేశామన్నారు. అటు తర్వాత పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నామన్నారు సీపీ ఇదిలా ఉంచితే, బండి భగీరథ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మేడ్చల్ కోర్టులో బాధితురాలు.. మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. బాధితురాలి తల్లిదండ్రుల స్టేట్‌మెంట్ కూడా కోర్టు రికార్డ్ చేసింది. ఇప్పటికే రెండుసార్లు స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా స్వయంగా రంగంలోకి దిగిన న్యాయమూర్తి.. బాలిక స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. బాలిక తల్లిదండ్రుల నుంచి కూడా విడివిడిగా జడ్జి.. స్టేట్‌మెంట్ తీసుకున్నారు. బాధిత కుటుంబం నుంచి న్యాయస్థానం కీలక వివరాలు సేకరించింది. మూడోసారి స్టేట్‌మెంట్ ప్రక్రియ.. ?కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారింది. న్యాయమూర్తి సేకరించిన స్టేట్‌మెంట్ ఆధారంగా తదుపరి విచారణ మరింత వేగవంతం కానుంది.

## జూన్ 15 నుంచి తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే నెల 15 నుంచి సర్ ప్రక్రియ మొదలవుతుందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేస్తారని వివరించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటర్‌కు రెండేసి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని చెప్పారు. ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశముందని తెలిపారు.

**అనర్హులను తొలగించడమే సర్ లక్ష్యం**

ఓటరు జాబితా డ్రాఫ్ట్‌ను రాజకీయ పార్టీలకు ఇవ్వడంతో పాటు వెబ్‌సైట్‌లోనూ పెడతామని సీఈఓ సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు తెలపవచ్చని, అభ్యంతరాలు పరిశీలించాక అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఓటర్ జాబితాలో అనర్హులను తొలగించడమే సర్ లక్ష్యమని వెల్లడించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని సీఈవో తెలిపారు. ప్రతి ఓటర్‌కు రెండు ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని, ఒకటి పూర్తి చేసి మళ్లీ బీఎల్‌వోలకు ఇవ్వాలని అన్నారు. ఇంకో ఎన్యుమరేషన్ ఫామ్‌ను ఓటరు దగ్గరే అక్‌నాలెడ్జ్‌ఫామ్‌గా ఉంచుకోవచ్చని చెప్పారు. ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశం ఉందని, జశీవతీం.వఎఱ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫామ్‌లు సేకరించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో చివరిసారిగా 2002లో ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరగబోతుందని తెలిపారు. "వచ్చే నెల 15 నుంచి రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ మట్నదలవుతుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేస్తాం. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారు. ప్రతి ఓటర్‌కు రెండు ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారు. ఒకటి పూర్తి చేసి మళ్లీ మాకు ఇవ్వాలి. ఇంకో ఎన్యుమరేషన్ ఫామ్‌ను ఓటరు దగ్గరే అక్‌నాలెడ్జ్‌ఫామ్‌గా ఉంచుకోవచ్చు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు తెలపవచ్చు. అభ్యంతరాలు పరిశీలించాక అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురిస్తాం" - సుదర్శన్ రెడ్డి, సీఈవో

## బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు జారీ

-మొదటిపేజీ తరువాయి

జారీ చేశారు. అతని ఫోన్ కాల్ డేటా ఆధారంగా బంధువులు, స్నేహితుల ఇళ్లపై పోలీసులు నిఘా పెట్టారు. భగీరథ్ కోసం 5 బృందాలు గాలిస్తున్నాయి. బంజారాహిల్స్‌లోని అతని తండ్రి నివాసానికి వెళ్లిన ఓ బృందం గంటపాటు తనిఖీలు చేసింది. అనంతరం అక్కడి నుంచి పోలీసులు వెళ్లిపోయారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని



సన్నిహితులు బంధువుల ఇళ్లల్లో మరో మూడు బృందాలు నిఘా పెట్టాయి. వీటితో పాటు కరీంనగర్‌లో మరో బృందం గాలిస్తోంది. ఉదయం నుంచి బండి భగీరథ్ లొంగిపోతారని ప్రచారం సాగింది. సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయం వద్ద, పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ వద్ద పోలీసులు బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆందోళనకర పరిస్థితులు ఏర్పడవద్దనే కోణంలోనే బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంలో తీవ్రంగా పరిగణిస్తోంది.

**మరోరోజు విచారణకు వస్తా**

ఈనెల 12 న బండి భగీరథ్ హైకోర్టులో ముందస్తు బెయిల్? పిటిషన్ వేశారు. అదే రోజు పేట్ బషీరాబాద్ పోలీసులు బుధవారం స్టేషన్?కు రావాలని నోటీసులు జారీచేశారు. వీటికి బండి భగీరథ్ గైర్హాజరయ్యారు. తరువాత మరోసారి విచారణకు హాజరవుతానని పేట్ బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపారు. విచారణకు పూర్తిగా సహకరిస్తామని మెయిల్?లో వెల్లడించారు.

**ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేము**

పోక్సో కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ బండి భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీ దేవి శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి దాదాపు అర్ధరాత్రి 12 గంటల వరకు విచారణ చేపట్టారు. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం బాలిక వాంగ్మూలం పరిశీలించిన తర్వాత ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

**పారిపోవడం సరైన పద్ధతి కాదు**

మరోవైపు ఇదే కేసు గురించి సీఎం రేవంత్ ?రెడ్డి మాట్లాతుతూ, బండి సంజయ్? తీరు నైతికంగా సరైనది కాదని పేర్కొన్నారు. నేరారోపణలు వచ్చేసరికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు పారిపోవడం సరైన పద్ధతి కాదని వెల్లడించారు. త్వరగా అతడిని అప్పగించాలని కోరారు. ఈ పరిణామాల తరువాత పోలీసులు ఇవాళ బండి భగీరథ్?పై లుక్? ఔట్ నోటీసులు జారీచేశారు.

## తెలంగాణలో సర్ చిచ్చు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' చిచ్చు రేపుతోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య యుద్ధానికి దారితీసింది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వహిస్తున్న మౌనం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీస్తోంది. ఓటరు జాబితాలో బోగస్ ఓట్లు, డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడమే 'సర్' లక్ష్యమని కేంద్రం చెబుతున్నా, బీజేపీయేతర పార్టీలు మాత్రం దీనిని ఒక రాజకీయ ఆయుధంగా చూస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ తీవ్ర వివాదాలకు కేంద్ర బిందువైంది. పశ్చిమ బెంగాల్లో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ముఖ్యంగా అక్రమ వలసదారుల పేరుతో మైనార్టీ వర్గాల ఓట్లు గల్లంతు చేశారని, తద్వారా బీజేపీ లబ్ధి పొందిందనే వాదన బలంగా వినిపించింది. బీహార్ లో కూడా ఆర్‌జేడీ, కాంగ్రెస్ వంటి పార్టీలు సర్ విధానాన్ని వ్యతిరేకించాయి. పారదర్శకత లేని తొలగింపులు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని విమర్శించాయి. ఈ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వీధుల్లోకి వచ్చి పోరాడితే, తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ను కలిసి నాఎఖీపై తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. పౌరసత్వ చట్టాన్ని సాకుగా చూపి మైనార్టీల ఓట్లను తొలగించవద్దని, 14 రకాల గుర్తింపు కార్డుల్లో దేనిని చూపించినా ఓటరుగా గుర్తించాలని కోరింది. నిజామాబాద్, భైంసా, బోధన్ వంటి ప్రాంతాల్లో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉండటంతో, అక్కడ 'సర్' ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. దేశవ్యాప్తంగా బీజేపీయేతర పక్షాలు 'సర్'పై గళమెత్తుతుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీని వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. మైనార్టీల ఓట్ల కోసం 'సర్'ను వ్యతిరేకిస్తే, మెజారిటీ హిందూ ఓటర్లలో వ్యతిరేకత వస్తుందని కేసీఆర్ భావిస్తున్నారనే సందేహం కలుగుతోంది. ఇప్పటికే మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో, ఇప్పుడు వారి కోసం పోరాడి ఉన్న హిందూ ఓట్లను పోగొట్టుకోవడం ఎందుకని బీఆర్ఎస్ భావిస్తుండవచ్చు. ఇటీవల ప్రధాని మోడీ పర్యటనపై కూడా బీఆర్ఎస్ పెద్దగా స్పందించలేదు. 'సర్' వంటి విధానపరమైన అంశాల్లో బీజేపీని విమర్శించకపోవడం ద్వారా, కేంద్రంతో సన్నిహితంగా ఉండాలని చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పాతబస్తీ వంటి చోట్ల ఎంఐఎం బలంగా ఉంది. అక్కడ ఓట్లు తొలగించినా ఎంఐఎంకే నష్టం తప్ప తమకేమీ కాదనే ధీమా కూడా బీఆర్ఎస్‌లో ఉండవచ్చు. ఒకవైపు కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి ఎన్నికల సంఘం చుట్టూ తిరుగుతోంది. ఎంఐఎం తనదైన శైలిలో పోరాటానికి సిద్ధమవుతోంది. కానీ, రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వంటి పార్టీ, ఇంతటి కీలకమైన అంశంపై నోరు విప్పకపోవడం ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తోంది. ఓటర్ల తొలగింపు ప్రక్రియ పూర్తయ్యాక, తుది జాబితా వచ్చాక కూడా బీఆర్ఎస్ ఇదే మౌనాన్ని కొనసాగిస్తే.. ఆ పార్టీ కేవలం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ఓటు హక్కుపై ఆసక్తి లేదని స్పష్టమవుతుంది. బీఆర్ఎస్ మౌనం.. బీజేపీకి పరోక్షంగా సహకరించడమే అవుతుందనే విమర్శలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో 'సర్' చుట్టూ జరుగుతున్న ఈ లొల్లి, రాబోయే ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తోంది.

# ఇందిరా మహిళా డెయిరీ అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి...

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
నిధులు వృథా కాకుండా అధికారులు
నిరంతర పర్యవేక్షణ చేయాలి
గ్రామ, మండల స్థాయిలో మౌళిక సదుపాయా
ల అభివృద్ధి పనులు సమాంతరంగా చేపట్టాలి
ఉపాధి హామీ ద్వారా మౌళిక సదుపాయాల
పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు పొందాలి
ఇందిరా మహిళా డెయిరీపై సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం, జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ మే 16** ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమం అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖకు కేటాయించిన లబ్ధిదారుల లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ విడుదల అనంతరం అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి సంబంధించి బడ్జెట్ త్వరగా విడుదలయ్యేలా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, మైనారిటీ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. విడుదలైన నిధులు సక్రమంగా వినియోగం అయ్యేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, యూనిట్లు నిర్దేశిత కాల వ్యవధిలో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి అవసరమైన గ్రామ స్థాయి, మండల స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమాంతరంగా చేపట్టాలని, దీనిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు వెంటనే పొందాలని సూచించారు. కొంతమంది లబ్ధిదారులకు అవసరమైన పశువుల షెడ్ల నిర్మాణాలను ఉపాధి హామీ క్రింద పరిగణనలోకి తీసుకుని, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రారంభంగా వినియోగిస్తున్న డీఎంఎఫ్‌టీఈ నిధులను, ఉపాధి హామీ నిధులు మంజూరైన తర్వాత తిరిగి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సభ్యులకు మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలకు సంబంధించి, ఆసక్తి చూపిస్తూ ముందుండి పనులు చేపట్టే లబ్ధిదారులను ఎంపీడీవోలు గుర్తించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో ఇప్పటికే పనులు ప్రారంభమైన లబ్ధిదారుల కోసం అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. ప్రగతిశీల లబ్ధిదారులకు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్ మొత్తాన్ని అందించి, అనంతరం ఉపాధి హామీ నిధులు వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి జమ చేసే విధానాన్ని పారదర్శకంగా, ఖచ్చితంగా పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. పశువుల షెడ్ల నిర్మాణం పటిష్టంగా, నాణ్యతతో ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు సోలార్ వ్యవస్థ ఏర్పాటును కూడా చేపట్టాలని ఆదేశించారు. రెడ్కో అధికారులతో సమన్వయం చేసుకుని అర్హతలను పరిశీలించాలని సూచించారు. సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు సాధ్యమైన ప్రాంతాలను సాంకేతికంగా పరిశీలించి, అనుకూల ప్రాంతాల్లోనే పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా డెయిరీ వచ్చే రెండు సంవత్సరాల్లో పూర్తిస్థాయి స్వయం సమృద్ధి సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి బీఎంసీ వద్ద బ్రేక్ ఈవెన్ సాధించేందుకు రోజుకు ఎంత లీటర్ల పాలు సేకరించాల్సి ఉంటుందో అంచనా వేసి, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డెయిరీ స్థిరత్వం కోసం ఎంత మేర పాలు సేకరించాలి, సేకరించిన పాలను ఎక్కడ విక్రయించాలి అనే అంశాలపై పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికను వచ్చే మంగళవారం లోగా సమర్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, బిసి అభివృద్ధి అధికారి జి.జ్యోతి, ఇంచార్జీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ముజాహిద్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి పురంధర్, పంచాయతీ రాజ్ ఈఈ మహేష్, విజయ డెయిరీ డిడి కె.రవి కుమార్, డిఆర్డిఓ ఏపిడి జయశ్రీ, వ్యవసాయ శాఖ ఏడిఏ ఎస్. విజయ్ చంద్ర, ఏపిఎంలు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## "బ్రహ్మదండి నాగేశ్వరరావు మంజుల ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమాలు



ఎల్‌బీనగర్ పరిధిలోని మాధవ నగర్ కమిటీ హాల్లో అమావాస్య సందర్భంగా ఘనంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మదండి నాగేశ్వరరావు, మంజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అమావాస్య రోజున అన్నదానం చేయడం హిందూ సంప్రదాయంలో మహా పుణ్యకార్యంగా భావిస్తారని తెలిపారు. పితృదేవతలకు తర్పణాలు చేసి వారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాధవ నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ప్రణీత్, ఉయ్యాల యాదయ్య గౌడ్, ముగుతాల విజయ్ గౌడ్, దీపక్ ముదిరాజ్, బి. వంశీ, శ్రావణి, వరుణ్, శిరీషతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## దళితరత్న కోటపాటి రుక్మారావు కి ఘన సన్మానం



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ మే 16** ఖమ్మం: టీఎన్జీవోస్ ఇరిగేషన్ మెయింటెనెన్స్ ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్టల్స్ పురోగతిలో, సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న దళితరత్న, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు ని ఆత్మీయంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ, రుక్మారావు హాస్టల్ విద్యార్థుల అభ్యున్నతి, ఎస్సీ సామాజిక వర్గాల సంక్షేమం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. సేవాభావం, నిబద్ధత, సంఘటిత చైతన్యంతో ఆయన కొనసాగిస్తున్న సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోటపాటి రుక్మారావు మాట్లాడుతూ, ఉద్యోగులు సంఘటిత శక్తితోనే తమ హక్కులను సాధించుకోగలరని తెలిపారు. యూనియన్ వ్యవస్థ ఉద్యోగులకు కన్నతల్లి వంటిదని, ప్రతి ఉద్యోగి సంఘం పట్ల ప్రేమాభిమానాలతో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తనకు ఘన సన్మానం నిర్వహించిన నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి.ఈ. రాంబాబు , టీఎన్జీవోస్ ఇరిగేషన్ మెయింటెనెన్స్ ఫోరం అధ్యక్షులు బి. రమణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి ఈశ్వర్ బహదూర్, నాయకులు సురేష్, మల్లారెడ్డి, ప్రముఖ జర్నలిస్ట్ చిత్రా రవి, ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు.



**గార్ల, మే 16(అక్షర రేఖ)** గార్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా విద్యా వారోత్సవాలను శనివారం రోజు ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా మొదటి రోజు మౌలిక వనరుల సదుపాయాన్ని పెంపొందించుకునే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కళాశాలలో మౌలిక వనరుల కల్పన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కళాశాలలో మౌలిక వనరుల సదుపాయాలను పెంపొందించే కార్యక్రమాన్ని విద్యా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించాలని తెలియజేయడం జరిగిందని, అందులో భాగంగానే ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా 2026-27 విద్యా సంవత్సరానికి గాను కళాశాల అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రమును కూడా ఆవిష్కరించారు.గార్ల మండల పరిసర ప్రాంతాల్లోని ఇంటర్మీడియట్ పాసైన ప్రతి విద్యార్థి ఈ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల గార్ల లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కళాశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను ప్రిన్సిపాల్ డా. డి. రాజు గారి అధ్యక్షత ఆరోవ రోజు కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ గారు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషల్ ఇంటెలిజెంట్స్)ప్రాముఖ్యత గురించి వివరిస్తూ ప్రస్తుత రోజులలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెంట్స్ ను యువత ఆకర్షస్తుందని,దీనిపైయువత తో పాటు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని,మంచికి మాత్రమే దీనిని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కోల్ యజమాన్యం ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలి..

-రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్



**రెబ్బెన, (అక్షర రేఖ) :** సమ్మె కాలపు ఒప్పందం ప్రకారం 15వ తేదీ లోపు వేతనాలు చెల్లించి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. శనివారం గోలేటిలో డ్రైవర్లు,క్లీనర్లు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించడం జరిగిందని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగె ఉపేందర్ అన్నారు. సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలో గతంలో లారీ డ్రైవర్లు,క్లీనర్లు తమ వేతనాలు పెంచి ఇతర సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేయడం తో ఆ సమ్మె కాలంలో వేతనాలు డ్రైవర్ కు రూ 22000, క్లీనర్ కు రూ 11000 చెల్లించే విధంగా ఒప్పందం జరిగిందని ఆ ఒప్పందం ప్రకారం ప్రతినెల 15వ తేదీన వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు కూడా వేతనాలు చెల్లించకపోవడంతో శనివారం బెల్లంపల్లి ఏరియా గోలేటిలో పనిచేస్తున్న కోల్డ్ ట్రాన్స్పోర్ట్ కార్మికులైన లారీ డ్రైవర్లు, క్లీనర్లు విధులు స్వచ్ఛందంగా బహిష్కరించడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించి ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలతో పాటు ఈపీఎఫ్,ఈఎస్ఐ,గ్రాటివిటీ,బోనస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకటేష్, మనోహర్, ప్రశాంత్, శంకర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజా సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహించాలి
ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ





**జోగులాంబ గద్వాల, మే 16(అక్షర రేఖ) :** ప్రజా సాంస్కృతిక రంగంలో పని చేస్తున్న కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలోని ప్రసాద్ స్కీం భవనంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఎం జె వినోద్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది జానపద వృత్తి కళాకారులు, తమ కళనే నమ్ముకుని జీవిస్తున్న వందలాది మంది కళాకారులకు ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకొని పేద కళాకారులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గతంలో చేపట్టిన విధంగా ప్రభుత్వ కళాజాతలు నిర్వహించి కళాకారులకు ఉపాధి కల్పించాలన్నారు. డప్పు, కోలాటం, చెక్కభజన, యక్షగానం వంటి కళలను నేర్పిన గురువులకు ప్రతినెల గౌరవేతనం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన ప్రజానాట్యమండలి ఎప్పటికప్పుడు ఆటై, పాటై తమ కలాన్ని, గలాన్ని వినిపిస్తుందన్నారు. సాహిత్యం, కళలు సమాజ చైతన్యానికి దోహదపడతాయన్నారు. పాలకుల విధానాల వల్ల ఆర్థిక సామాజిక రంగాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఆ విధానాలను ప్రశ్నిస్తూ కళాకారులు ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతిక ఉద్యమంలో కళాకారులందరూ కలిసి రావాలని సూచించారు. అంతకుముందు రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వినోద్ ప్రజానాట్యమండలి జెండాను ఎగురవేశారు. ప్రజా సాంస్కృతిక ఉద్యమం కోసం భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్, కోశాధికారి గోవర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మారెన్న, నాగభూషణం, శారద, కాకం మంజన్న, సిరిపులింగం, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముత్యాలు, కొండూరి భాస్కర్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ,జక్కిడి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షులు అలీ అక్బర్, జిల్లా కార్యదర్శి ఆశన్న ఆయా జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారుల సంఘం తరుపున కృతజ్ఞతలు



**గార్ల, మే 16(అక్షర రేఖ)** గార్ల మండల కేంద్రంలోని ఈరోజు ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ వేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు ఉద్యమకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యమకాలను గుర్తించి వారి యొక్క త్యాగాలను వృధా కాకుండా అమరవీల కుటుంబాలకు మరియు ఉద్యమంలో అంగవైకల్యం అదేవిధంగా జైలు జీవితం గడిపినవారు కేసు తీవ్రతను బట్టి ఉద్యమకారులందరికీ రాష్ట్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన ప్రకారం ప్రతి ఒక్క ఉద్యమకారుని కుటుంబానికి న్యాయం చేకూరాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కోళ్ల కుమార్ గౌడ్, గార్ల వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లల మద్రి వీరస్వామి, నియోజకవర్గ నాయకులు మోతుకూరి విద్యాసాగర్,షైక్ యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## అశ్వరావుపల్లి ఐకెపి సెంటర్లో 6 రోజుల నుండి లారీలు రాక నిలిచిపోయిన వారి ధాన్యం బస్తాలు

అదనపు లారీలను ఐకెపి సెంటర్లకు పంపించాలి
సిపిఎం మండల కమిటీ సభ్యులు పొదల నాగరాజు



**రఘునాథపల్లి /అక్షర రేఖ) మే 16:** రఘునాథపల్లి మండలం అశ్వరావు పల్లి గ్రామంలో ఈరోజు ఐకెపి సెంటర్ ను సిపిఎం మండల కమిటీ బృందం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మీసరగండ్ల నరసయ్య అధ్యక్షతన పొదల నాగరాజు పాల్గొని మాట్లాడుతూ రైస్ మిల్లుల వద్ద దిగుమతిని వేగవంతం చేయాలని రైస్ మిల్లు యజమాన్యాన్ని కోరారు లారీల కొరత బాగా ఉందని ఐకెపి సెంటర్లలో సరిగా లారీలు రావడం లేదని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇప్పుడు వచ్చే వాటికంటే అదనపు లారీలను కేటాయించి ధాన్యం కొను గోళ్ల ను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు అశ్వరావు పల్లి గ్రామంలో ఈరోజు వరకు 6 లారీల ధాన్యం మాత్రమే మిల్లులకు చేరిందని ఇంకా 5 లారీల ధాన్యం కాంట వేసి ఐకెపి సెంటర్లో నిల్వ ఉందని అన్నారు వడ్ల రాసుల ద్వారా ఇంకా 180 లారీల ధాన్యం ఐకేపీ సెంటర్లో ఉందని వెంటనే రైతులను ఇబ్బంది పెట్టకుండా లారీలను పంపించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు ఒక బస్తా కు 41 కిలోలు మాత్రం కాంట పెట్టాలని ప్రభుత్వము ఒక వైపు చెబుతున్న కానీ అక్కడున్న మిల్లర్లు మాత్రం ఒక బస్తా కు 42 కిలోలు కంట వేస్తేనే లారీలు పంపిస్తామని మిల్లర్లు అంటున్నారన్నారు ఇద్దరి మధ్యలో రైతు నష్టపోవాల్సి వస్తుందని ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా . జిల్లా కలెక్టర్ గారు రబి టార్గెట్ ప్రారంభించాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చి 20 రోజులు అవుతున్న ప్రారంభించకుండా కాలయాపన చేయడం వలన అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారన్నారు. ఐకెపి,వడ్ల తరలింపు సమస్యలపై వెంటనే కలెక్టర్ స్పందించి సరిపడ లారీలను పంపించి వరి ధాన్యం కొనుగోలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ప్యారాల రాజు విజయ గద్దరాజు గద్ద స్వామి కుర్రా రేణుక సాదం విజయ మీసరగశీడ్ల మమత ఏనమల అనిల్ కొయ్యడ వెంకటయ్య ఇస్కిల్లా కమలాకర్ అశోక్ కడారి నవీన్ ఎల్లయ్య వెంకటయ్య సరెంధర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు

# పురుష:'లో అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటాయి.

కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం – దర్శకుడు వీరు వులవల బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర దర్శకుడు వీరు వులవల మీడియాతో పంచుకున్న విశేషాలివే.. మీ నేపథ్యం గురించి చెప్పండి? నాకు పెయింటింగ్స్ వేయడం అలవాటు. చిన్నప్పుడు హీరోల బొమ్మల్ని క్లాత్ మీద పెయింటింగ్ వేసేవాడ్ని. వాటిని థియేటర్ల ముందు అందరూ కట్టుకునేవారు. ఆ తరువాత బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేశాను. ఏ పని చేసినా సరే నేను ఇండస్ట్రీలోనే ఉండాలని అనుకున్నాను. ఆ టైంలోనే 'కొత్త బంగారు లోకం' టైటిల్‌ను రాసి, డిజైన్ చేశాను. అలా నేను ఇప్పటికీ చిరంజీవి గారు, పవన్ కళ్యాణ్ గారు ఇలా చాలా మంది హీరోలకు కలిపి 350కి పైగా టైటిల్స్‌ని రాసి, డిజైన్ చేశాను. నిర్మాత గారిని ఎలా ఒప్పించారు? ఆయన కథ విన్న తరువాత ఏం చెప్పారు? ఈ కథను పట్టుకుని తిరుగుతున్న టైంలో 'మసూద' సినిమాకి దర్శకత్వ శాఖలో పని చేసే అవకాశం వచ్చింది. అది కూడా మంచి విజయం సాధించింది. ఒక మూడు నెలలు చాలా సీరియస్‌గా వర్క్ చేశాను. ఎంతో మందికి కథను వినిపించాను. అప్పుడు ఓ సారి కోటేశ్వరరావు గారి వద్దకు కథ వెళ్లి ఆగింది. గోవింద్ (పవన్ కళ్యాణ్), కమల (రాయంచ) ప్రేమ కథ మెయిన్ పాయింట్. కాకపోతే సపోర్టింగ్ పాత్రలు ఎక్కువగా ఉంటాయని కోటేశ్వరరావు గారికి చెప్పాను. ఆ కథను విన్న తరువాత ఆయనకు చాలా నచ్చింది. ఇలాంటి సినిమా అయితేనే ఫ్యామిలీ ఆడియెన్స్‌కి మా అబ్బాయి రీచ్ అవుతాడని కోటేశ్వరరావు గారు అనుకుని ఓకే చెప్పారు. నిర్మాత గారి సపోర్ట్ గురించి చెప్పండి? నిర్మాత కోటేశ్వరరావు గారు ఏ ఒక్క రోజు కూడా ఏ ఒక్క విషయంలో మమ్మల్ని ప్రశ్నించలేదు. ప్రతీ ఒక్క స్టేజ్‌లో మా అందరినీ ప్రోత్సహించారు. ఆయన కూతురు సరస్వతి గారు అయితే ప్రతీ రోజూ సెట్‌లో మా అందరినీ ఎంతో చక్కగా చూసుకున్నారు. వీరిద్దరి సపోర్ట్‌తోనే సినిమాని ఇంత బాగా తీయగలిగాను. సినిమా చూసిన తరువాత కోటేశ్వరరావు గారు నన్ను పట్టుకుని ఏడ్చేశారు. ఇది నా 26 ఏళ్ల కల అని కన్నీరు పెట్టుకున్నారు. 'పురుష:'లోని పాత్రలు ఎలా ఉంటాయి? ప్రేమ కోసం ఏమైనా చేసే ఓ మంచి పాత్రలో పవన్ కళ్యాణ్ కనిపిస్తారు. సప్తగిరి, కసిరెడ్డి పాత్రలు అందరినీ ఎంటర్టైన్ చేస్తాయి. మరీ ముఖ్యంగా కసిరెడ్డి పాత్ర కోసం రాసిన డైలాగ్స్ ఎక్కువగా అలరిస్తాయి. వీటీవీ గణేష్, అనంత శ్రీరామ్, వెన్నెల కిషోర్ గారు చాలా పాత్రలుంటాయి. ప్రతీ ఒక్క కారెక్టర్ అందరినీ ఆకట్టుకుంటుంది. వెన్నెల కిషోర్ గారితో కిటికీ వద్ద ఉండే ఎపిసోడ్‌కి థియేటర్లో అందరూ పగలబడి నవ్వేస్తారు. ఆ సర్ ప్రైజ్ మూమెంట్ ఏంటో మీకు సినిమా చూస్తేనే తెలుస్తుంది. ఆ కిటికీ ఎపిసోడ్ సినిమాకి హైలెట్. 'పురుష:' కథ ఎలా పుట్టుకొచ్చింది? నేను అవకాశాల కోసం చాలా చోట్ల తిరిగాను. అయితే గౌతమ్ తిన్ననూరి గారి 'మళ్లీరావా' సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. ఆ సినిమాలో ప్రతీ ఫ్రేమ్‌కి డ్రాయింగ్ వేశాను. ఆ చిత్రం మంచి విజయం సాధించింది. ఆ తరువాత గౌతమ్ గారితో జర్నీ స్టార్ట్ అయింది. 'జెర్సీ'కి కూడా నేను పని చేశాను. 'జెర్సీ' మూవీకి పని చేస్తున్న టైంలోనే ఈ 'పురుష:' పాయింట్ తట్టింది. పురుషులందు పుణ్య పురుషులు వేరయా అనే పాయింట్‌తో ముందు కథను స్టార్ట్ చేశాను. 'పురుష:' ఎలా ఉండబోతోంది? భార్యాభర్తల మీదే స్టోరీని రాయాలని అనుకున్నాను. అయితే ఫీమేల్ ఓరియెంటెడ్ కథలెన్నో మనం చూశాం. కానీ ఇది మేల్ ఓరియెంటెడ్‌గా తీయాలని అనుకున్నాను. ఇలాంటి జానర్ ఒకటి ఉందా? అని అనుకున్నాను. అలా కథ పూర్తి చేశాను. ఈ కథను చాలా మందికి వినిపించాను. ప్రతీ రిజెక్షన్‌తో కథలో ఒక్కో డెవలప్మెంట్ చేశాను. పూర్తి వినోదాత్మకంగా ఈ సినిమా సాగుతుంది. వెంటనే షూటింగ్‌ని స్టార్ట్ చేశారా? లేదా ఏమైనా వర్క్ షాప్స్ నిర్వహించారా? పవన్ కళ్యాణ్ కొత్త ఆర్టిస్ట్. సత్యానంద్ గారి వద్ద శిక్షణ తీసుకున్నారు. అయితే వెంటనే షూటింగ్‌కి వెళ్లలేదు. ఓ రెండు నెలల పాటుగా వర్క్ షాప్స్



నిర్వహించాం. ఆ తరువాతే షూటింగ్‌కి వెళ్లాం. 51 రోజుల పాటు చిత్రీకరించాం. కాకినాడలోనే ఎక్కువగా సినిమాని షూట్ చేశాం. 'పురుష:' టెక్నికల్ టీం గురించి చెప్పండి? కెమెరామెన్ సతీష్ గారి వల్లే నిర్మాత పరిచయం అయ్యారు. ఆయనతో నాకు 'మళ్లీరావా' నుంచే పరిచయం. నేచురల్ లొకేషన్స్‌లోనే దాదాపుగా షూటింగ్ చేశాం. ఇందులో ఆరు పాటలుంటాయి. ప్రతీ పాట చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. 'మళ్లీరావా' నుంచీ నాకు మ్యూజిక్ డైరెక్టర్ శ్రవణ్ గారు పరిచయం. మంచి పాటలతో పాటుగా, అద్భుతమైన ఆర్ఆర్ కూడా ఇచ్చారు. అందరూ నాకు గొప్పగా సహకరించారు. 'పురుష:' గురించి ఫైనల్‌గా చెప్పండి? ప్రస్తుతం నా వద్ద యాక్షన్, ఫ్యాంటసీ, థ్రిల్లర్ జానర్లలో కథలు రెడీగా ఉన్నాయి. ఈ సినిమాలోనూ కొన్ని చోట్ల హారర్, థ్రిల్లర్, యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయి. అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది.

# అర్ధరాత్రి వ్యూహం.. తెల్లవారుజామున మెరుపు దాడి!

## అన్నమయ్య జిల్లాలో పోలీసుల 'ఆపరేషన్ వజ్రప్రహార్'

**మదనపల్లి :** శాంతిభద్రతల పరిరక్షణే శ్వాసగా, ప్రజల సురక్షిత జీవనమే పరమావధిగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ శనివారం తెల్లవారుజామున అత్యంత పకడ్బందీగా రెండు భారీ నిఘా ఆపరేషన్‌లను నిర్వహించింది. జిల్లాను నేరరహితంగా మార్చడానికి, సమాజానికి ముప్పుగా పరిణమిస్తున్న శక్తుల ఆటకట్టించడానికి "ఆపరేషన్ వజ్రప్రహార్" నిర్వహించారు. ఈ వ్యూహాత్మక చర్య శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, జిల్లా అంతా ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో అత్యంత నిశ్శబ్దంగా మొదలైంది. మదనపల్లె, రాయచోటి సబ్ డివిజన్లలోని సమస్యాత్మక ప్రాంతాలే లక్ష్యంగా పోలీసులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. సరిగ్గా సమయం ఉదయం 4:00 గంటలు.. కోడికూత కూడా వినబడని ఆ కారుచీకట్లో ప్రజల రక్షణ కోసం పోలీస్ బలగాలు అడుగులు వేశాయి. మదనపల్లె డీఎస్పీ శ్రీమతి బి. పావని గారి నేతృత్వంలో 105 మంది, రాయచోటి డీఎస్పీ శ్రీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గారి నేతృత్వంలో 61 మంది.. మొత్తం 166 మంది నిబద్ధత గల పోలీస్ అధికారులు, సిబ్బంది ఏకకాలంలో రంగంలోకి దిగారు. ఎవరికీ ఎటువంటి ముందస్తు సమాచారం లీక్ కాకుండా, అత్యంత రహస్యంగా మదనపల్లె తాలూకా పరిధిలోని కోళ్లబైలు జగన్ కాలనీ, కలకడ మండలం బంగారువాండ్లపల్లి గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నిశ్శబ్దంగా సాగిన ఈ మెరుపు తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది వీధుల్లో సోదాలు నిర్వహిస్తుండగా, భూతలం నుండి ఎవరూ తప్పించుకోకుండా నిఘాను మరింత పటిష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామాలపై గగనతలం నుంచి పర్యవేక్షణ చేపట్టారు. గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తూ అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేలా నిఘా కొనసాగించారు. ఈ అధునాతన నిఘా వ్యవస్థతో గ్రామాల్లోని ప్రతి సందు, పొదలు మరియు నిర్మానుష్య ప్రాంతాలను కంట్రోల్ రూమ్ స్క్రీన్లపై నిరంతరం పర్యవేక్షించారు. పోలీసులు పన్నిన ఈ రక్షణ వలయంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగాయి. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తూ, నెంబర్ ప్లేట్లు మార్చి,



సరైన రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆయా ప్రాంతాలలో అనుమానాస్పదంగా ఉన్న మొత్తం 133 వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. పక్కా ఆధారాలు లేని 78 వాహనాలను స్పాట్‌లోనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో 71 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్లు మరియు ఒక ట్రాక్టర్ ఉన్నాయి. చట్టపరమైన పూర్తి పత్రాలు సమర్పించిన తర్వాతే ఈ వాహనాలను విడుదల చేయడం జరుగుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అయితే పోలీస్ శాఖ అంటే కేవలం తనిఖీలు, కేసులు మాత్రమే కాదు.. ప్రజలతో మమేకమయ్యే రక్షకులు అని నిరూపిస్తూ, తనిఖీల అనంతరం మదనపల్లెలో 300 మంది, కలకడలో 210 మంది ప్రజలను ఒకచోటకు చేర్చి ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. స్థానిక శాంతిభద్రతల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. "మీ ప్రాంతాల రక్షణే మా బాధ్యత. ఊర్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, లేదా ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించండి" అని స్థానికుల్లో ధైర్యాన్ని నింపారు. అనంతరం సమాజ శ్రేయస్సు కోసం, నేరాల నిర్మూలన కోసం ప్రజలందరితో కలిసి పోలీసులు, ఈగల్ టీమ్ సిబ్బంది "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" చేయించారు. ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా నిలబడిన ఆ క్షణం ఈ ఆపరేషన్‌కే మకుటాయమానంగా నిలిచింది. యువత భవిష్యత్తును పాడుచేస్తూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల (గంజాయి, డ్రగ్స్) ముఠాలను వేరుతో సహా తొలగించడమేనని. ఈ సందర్భంగా డిఎస్పీ లు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై జిల్లాలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా పాత నేరస్థులైనా, కొత్త వారైనా సరే.. పీడీ యాక్ట్, పి.ఐ.టి, ఎన్‌డీపీఎస్ చట్టాల కింద అత్యంత కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

### ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**రాజన్న సిరిసిల్ల :** ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని,ధాన్యం తరలింపు,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం,వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయడం,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆర్డీఓలు, పౌర సరఫరాలు,వ్యవసాయ, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా,మెప్మా, మార్కెటింగ్,మార్క్ ఫెడ్,కార్మిక శాఖ అధికారులు,అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని,వాహనాలు సమకూర్చకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు.

### సైబరాబాద్‌లో కొత్త తరహా సైబర్ నేరం

**హైదరాబాద్ :** సైబరాబాద్ లో సరికొత్త తరహ సైబర్ నేరం బయటపడింది. ఈ సిమ్ ను ఫిజికల్ సిమ్ గా మార్చాలనీ బ్యాంక్ అధికారుల పేరుతో బాధితుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసారు. ఈ సిమ్ ను చేంజ్ చేసి జనరల్ సిమ్ గా మార్చి తాము పంపిన ఫోన్ లో వేయండి అని నమ్మించారు. మోటోరాల ఫోన్ ను బాధితుడికి పంపి ముందుగానే కొన్ని యాప్ లను పెట్టారు. తరువాత బాధితుడి ఖాతాలో ఉన్న 77 లక్షలు రూపాయలు కాజేసారు సైబర్ నేరగాళ్లు. సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ లో ఒక చెట్టు కింద కూర్చుని ఈ తరహా సైబర్ నేరానికి సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారు. అచ్చం జాంతార తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ నేరంలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసారు. 15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల పాటు వెస్ట్ బెంగాల్, ఢిల్లీ లో ఆపరేషన్ నిర్వహించినట్లు డీసీపీ వెల్లడించారు.

### కోదాడ లో "బడిబాట"

**కోదాడ :** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం "బడిబాట" (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు,

### పోలీస్ గేమ్స్ లో బంగారు పతకాలు సాధించిన ఏసిపి ని ఘనంగా సన్మానించిన మాస్టర్ క్రీడాకారులు.








**జమ్మికుంట. మే 16 అక్షర రేఖ** ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన అఖిల భారతీయ పోలీస్ క్రీడా పోటీల్లో హుజూరాబాద్ ఏసిపి వి. మాధవి టేబుల్ టెన్నిస్, బ్యాట్మెంటన్ లలో అత్యంత ప్రతిభను కనబరిచి బంగారు పతకాలు సాధించిన సందర్భంగా మాస్టర్ క్రీడాకారులు శనివారం తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి, పూల గుచ్చాన్ని అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ క్రీడాకారులు మాట్లాడుతూ పోలీస్ శాఖ విధినిర్వాహనలో బిజీ గా ఉంటూ ప్రజలకు నిరంతం సేవలందించడంతో పాటు, తనకున్న క్రీడారంగం పట్ల మక్కువతో సాధన చేస్తూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాలు సాధించడం గర్వ కారణమని అన్నారు. ఏసిపి మాధవి మహిళలకే కాకుండా నేటి యువతకు ఆదర్శమని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా తమకు ఉన్న నైపుణ్యాన్ని రుజువు చేసుకోవడానికి మంచి వేదికను తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మారేపల్లి మొగిలయ్య, అంతర్జాతీయ క్రీడాకారులు వంతడుపుల రఘు, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) మంద జగన్, మామిండ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి

**హైదరాబాద్ :** తెలంగాణ భవన్లో జరిగిన సనత్నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గోన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ (రాఎఫ్) పైన దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు.. కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువ ఉన్న పార్టీ బీజేపీ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే. నగరంలో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను కూడా నిర్వహించలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదరి అన్నారు.

### చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

**కరీంనగర్ సిపి గౌష్ ఆలం**

**కరీంనగర్ :** రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం నాడు కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో విశ్వ హిందూ పరిషద్ బజరంగ్ దళ్,గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ. పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా,తక్షణమే పోలీసులకు తెలియజేయాలే తప్ప చట్టాన్ని ఉల్లంఘించ కూడదని హెచ్చరించారు. అలా కాదని చట్టాన్ని అతిక్రమిస్తే,తెలంగాణ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం,1977 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. వ్యూహాత్మక ప్రాంతాలలో 6 చెక్‌పోస్టులుపశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్‌పోస్టులు,52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని..కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు.

### కరీంనగర్ అభివృద్ధికి 895 కోట్లు కేంద్రం పచ్చజెండా

**కరీంనగర్ :** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 895 కోట్లతో ప్రతిపాదించిన మూడు ప్రాజెక్టులకు అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ చొరవతో రహదారులు వరద నివారణ, వ్యర్థాల నిర్వహణ పనులకు ఈ నిధులు అందనున్నాయి. ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర అధికారుల బృందం నగరానికి రానుంది మంత్రి సంజయ్ కృషితో కరీంనగర్ మోడల్ సిటీగా మారనుందని అధికారులు తెలిపారు.

### రోడ్ నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్ కె. హైమావతి

**హుస్నాబాద్ :** హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు 77.20కోట్లతో నాలుగు వరసల రోడ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్ వెంబడి చెట్లు కటింగ్, పొదల తొలగింపు ప్రక్రియ దాదాపు పూర్తి అయిందని ఎలక్ట్రిక్ స్తంభాల షిఫ్టింగ్ పనులు సైతం వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్ జాయింట్ పర్యవేక్షణ చేసి మున్సిపల్ ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న చెట్లు కటింగ్,మార్కింగ్ చేసిన వరకు నివాసాలను తొలగించే ప్రక్రియ పూర్తి చెయ్యాలని ఆదేశించారు. రోడ్ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలోపు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్ లక్ష్మా రెడ్డి, విద్యుత్ శాఖ డిఈ, తదితరులు ఉన్నారు.

## సంపాదకీయం

# తడబడని తొలి అడుగులు

తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి అంచనాలకూ దొరకని రీతిలో ప్రారంభమై రెండేళ్ల పాటు దాన్నే కొనసాగించి చివరకు అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరూ ఊహించని రీతిలో అత్యధిక స్థానాలున్న పార్టీగా ఆవిర్భవించిన టీవీకే ఏలుబడి మొదలైంది. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 144 మంది ఓటేయగా, వ్యతిరేకంగా 22 మంది, అయిదుగురు తటస్థంగా ఉండి పోయారు. డీఎంకే, డీఎండీకే, పీఎంకే, బీజేపీలు వాకౌట్ చేశాయి. సభ్యుల ప్రమాణ స్వీకారం మొదలుకొని సమావేశం పొడవునా విజయ్ వ్యవహరించిన తీరు, విశ్వాస తీర్మానంపై చర్చకు జవాబిస్తూ చేసిన ప్రసంగం విమర్శలకు తావీయకుండా ముగియటం గమనించదగ్గది. తమ ప్రభుత్వం సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పటం మద్దతుగా నిలిచిన వామపక్షాలకూ, వీసీకేకూ ఊరటనిచ్చివుంటుంది. విజయ్ అణుకువతో, ఆవేశానికి తావీయని రీతిలో ఉంటూనే చేయదల్చుకున్నది చేస్తారని ఈ సమావేశం రుజువుచేసింది. వ్యక్తిగత జ్యోతిష్కుడు రికీ రాధన్ పండిట్ వెట్రివేల్‌ను ఓఎస్‌డీగా నియమించటాన్ని మిత్రపక్షం వీసీకే విశ్వాస తీర్మానం సమయంలో నిలదీసి నప్పుడు విజయ్ భేషజానికి పోకుండా వెంటనే ఆ నియామకాన్ని పునస్సమీక్షిస్తానని ప్రకటించారు. ఆ వెంటనే దాన్ని రద్దుచేసినట్టు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ప్రార్థనాస్థలాలు, విద్యాసంస్థలు, బస్టాండ్లు వగైరాలకు 50 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండొచ్చన్న నిబంధనను 500 మీటర్లకు సవరించటం, అది వెంటనే అమల్లో కొచ్చి పదులకొద్దీ దుకాణాలు మూతబడటం కూడా జనం మెచ్చే చర్య. విజయ్ రాక ఇప్పటికే ప్రధాన కూటములు, పార్టీల్లో ఊహించని ప్రకంపనలకు దారి తీసింది. దాదాపు ఆరు దశాబ్దాల చరిత్రగల ద్రవిడ పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకేలు జనం ఆదరణ కరవై దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఎన్నో సంక్షోభాల్ని తట్టుకుని నిలబడ్డ డీఎంకే--కాంగ్రెస్ కూటమి చెల్లాచెదురైంది. అందలం కోసం ఆత్రపడి కాంగ్రెస్ డీఎంకే చెలిమిని వదులుకు పోయిందిగానీ సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలు అదే కూటమిలో కొనసాగుతూనే విజయ్‌కి మద్దతివ్వక తప్పని స్థితికి చేరుకున్నాయి. అన్నాడీఎంకే చీలి ఆ పార్టీకి చెందిన 47 మంది ఎమ్మెల్యేల్లో 25 మంది మాజీ మంత్రి షణ్ముగం ఆధ్వర్యంలో పార్టీ నాయకుడు, మాజీ సీఎం పళనిస్వామికి షాకిచ్చారు. దాంతో టీవీకేకు చిన్న పార్టీల అవసరం నిజానికి ఇప్పటికే తీరిపోయింది. ఎవరిది అసలైన అన్నాడీఎంకే అనే అంశం తేలేసరికి చాలా సమయం పడుతుంది. ఈ క్రమంలో ఎక్కడా టీవీకే లేదా వ్యక్తిగతంగా విజయ్ ఆరోపణలు ఎదుర్కొనలేదు. ఎవరూ ఎవరితోనూ మాట్లాడకుండానే, గట్టి హామీలు ఇవ్వకుండానే అన్నాడీఎంకే చీలిపోయిందంటే ఎవరూ నమ్మరు. కానీ అదెక్కడా ప్రచారంలోకి రాకపోవటం విజయ్ వ్యూహచతురతకు నిదర్శనం. ద్రవిడ పార్టీలను ఎలాగైనా బలహీనపరచాలని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మొదలుకొని ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరకూ చేయని ప్రయత్నమంటూ లేదు. కాంగ్రెస్, బీజేపీలతో అవసరార్థం పొత్తు కుదుర్చుకుంటూనే వాటిని జనానికి చేరువ కానీయకుండా చేయటంలో అన్నాడీఎంకే, డీఎంకేలు ఇన్నాళ్లూ విజయం సాధించాయి. కానీ పార్టీకి ద్రవిడ నామం లేకుండా వచ్చిన విజయ్ సునాయాసంగా ఆ రెండు పక్షాలనూ మట్టికరిపించారు. అలాగని పెరియార్ రామస్వామి వంటివారిని ఉపేక్షించ కుండా నివాళులర్పించారు. ఆయన ఒకరకంగా రాష్ట్ర రాజకీయాల్లో మూడోపక్షానికి అవకాశం ఉన్నదని నిరూపించారు. విజయ్ సినిమా ఇతివృత్తాలు కథానాయకుడు తనకెదురయ్యే అవరోధాలను ఎదుర్కొనటం అనే అంశం చుట్టూ తిరుగుతాయి. చివరగా హీరో విజయం సాధించటంతో అవి ముగుస్తాయి. గత వారం రోజుల పరిణామాలు సైతం అదే ఒరవడిలో వెళ్లాయి. నాటకీయత లేకుండా సాధ్యమైనంత తక్కువ మాట్లాడటం, చేయదల్చుకున్నది తక్షణం చేయటం ఆయనలో కనబడే ప్రత్యేక లక్షణం. దీన్నే కొనసాగిస్తే, ప్రజల అభీష్టాన్ని నెరవేర్చే నిర్ణయాలు తీసుకుంటే ఎన్నికల్లో కొట్టొచ్చినట్టు కనబడిన జనాకర్షణ కాస్తా త్వరలోనే దృఢమైన పునాదిగా మారి, రాష్ట్ర రాజకీయాల్లో విజయ్ తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

# చట్టం ఎవరికీ చుట్టం కాకూడదు



సమాజ వైఖరి- రేపటి తరాన్ని చూస్తే చాలా భయం వేస్తున్నది. ఒక వెఱపు పుడుతున్నది... రోజు రోజుకూ ఎంత అనాగరికులమైపోతున్నామో కదా! అని సిగ్గేస్తున్నది. ఆటవిక సమాజంలో బతకడానికి అసహ్యమేస్తున్నది. దినదినగండం నూరేండ్ల ఆయుష్షు వలె ఉన్నది. అధికారంలో ఉన్నవారికి ఇలా అనిపించడంలేదంటే ఏమనుకోవాలి? అత్యాచారాలకు పాల్పడుతున్న ప్రముఖుల వంశోద్ధారకులకు నైతిక విలువలు అవసరంలేదా? లేక ప్రముఖుల పిల్లలు కాబట్టి ఏం చేసినా చెల్లుతుందనే నిర్లక్ష్యమా? ఇలాంటి ఘటనలు వెరసి సమాజానికి ఏం చెప్తున్నట్టు? వీరి వల్ల జీవితాలు నాశనమైన అనామకులైన ఆడపిల్లలకు ఎలాంటి న్యాయం చేకూర్చవచ్చు? ఇలాంటివి పునరావృతం కాకుండా ఏం చేయాలి? దోషులకు శిక్షలు పడకుండా అడ్డుకుంటున్న బడాబాబులది ఇష్టారాజ్యమై నప్పుడు బాధితులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రజల్లో ప్రశ్నలు మెదులుతున్నాయి. నేటి సమాజంలో 'ప్రముఖుల పిల్లలం' అనే ముసుగులో కొంతమంది చేస్తున్న అరాచకాలు విస్మయం కలిగిస్తున్నాయి. ఉన్నత కుటుంబాల్లో పుట్టి, సమాజానికి ఆదర్శంగా నిలువాల్సిన వారే అమానవీయ ఘటనలకు పాల్పడటం వెనుక బలమైన కారణాలు, భయంకరమైన పరిణామాలు కనబడుతున్నాయి. అరాచకానికి మూలం... నిర్లక్ష్యమా? అహమా? ఈ వికృత పోకడలకు ప్రధాన కారణం.. 'మా నాన్నకు అధికారం ఉన్నది, మా వెనుక బలగం ఉన్నది, మేము ఏం చేసినా చెల్లుతుంది' అనే అహంకారం వారిలో నైతిక విలువలను పతనం చేస్తున్నది. విలువలలేమి తనంతో సంపదను, అధికారాన్ని ఇచ్చిన తల్లిదండ్రులు బాధ్యతను, క్రమశిక్షణను నేర్పడంలో విఫలమవుతున్నారు. ముఖ్యంగా అధికారాన్ని ఉపయోగించి, శిక్షను రద్దు చేసుకోవచ్చనే ధీమా, పోలీసులకు పట్టుబడినా వెంటనే బయటకు రావొచ్చనే ధైర్యం.. అధికారంలో ఉండి వ్యవస్థను శాసించగలమనే నమ్మకం.. వారిని నేరాల వైపు పురికొల్పుతున్నది.

బరితెగించిన బడాబాబుల పిల్లల చేతిలో అభాగ్యులైన ఆడపిల్లల జీవితాలు ఛిద్రమైనప్పుడు, న్యాయం అనేది ఒక అందని ద్రాక్షలా మారుతున్నది. నిందితులు అధికార పార్టీకి చెందినవారో, బడాబాబుల పిల్లలో అయినప్పుడు సాక్ష్యాల తారుమారు, పోలీసుల మీద ఒత్తిడి.. వ్యవస్థాగత అడ్డంకులు సర్వసాధారణం. న్యాయం జరగాలంటే బాధితులకు ఉచిత న్యాయసహాయం, సామాజిక మద్దతు, సాక్షుల రక్షణ అత్యవసరం. నిందితుల స్థాయిని చూడకుండా చట్టం తన పని తాను చేసుకుపోయే వాతావరణం, బాధితులకు భరోసా కల్పించాలి. కానీ ఒక ఘటన జరిగి మరిచిపోకముందే మరిన్ని ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి అకృత్యాలు ఆగాలంటే కఠినమైన చట్టాలు ఉంటే మాత్రమే సరిపోదు, వాటిని సక్రమంగా అమలు చేయటం ముఖ్యం. ఏండ్ల తరబడి విచారణ జరిగితే నేరస్థులకు భయం ఉండదు. నెలల వ్యవధిలోనే శిక్ష పడాలి. నేరం చేసిన వాడు నేరస్థుడే తప్ప ' ప్రముఖుడి కొడుకు'గా పరిగణించకూడదు.

ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న దారుణమైన ఘటనలు సమాజానికి ఒక చేదు నిజాన్ని చెప్తున్నాయి. అదేంటంటే 'మనం నిర్మిస్తున్న సమాజం విలువల మీద కాకుండా అధికారం మీద ఆధారపడి ఉన్నది! బాధితులకు న్యాయం జరగనప్పుడు, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నప్పుడు సామాన్యుడికి చట్టం మీద నమ్మకం పోతుంది. ఇది అరాచకానికి దారి తీస్తుంది. అధికార గర్వంతో ఆడపిల్లల జీవితాలతో ఆడుకునే బడాబాబుల వారసులు వంశోద్ధారకులు కాదు, వంశ నాశకులు. చట్టం దోషి వెనుక ఉన్న అధికారాన్ని కాకుండా, బాధితురాలి కండ్లలోని కన్నీటిని చూడాలి. వ్యవస్థలు సక్రమంగా పనిచేయని చోట ప్రజాస్వామ్యం విఫలమవుతుంది. కాబట్టి, ఇలాంటి అన్యాయాల పట్ల ప్రతి ఒక్కరూ పోరాడాలి. న్యాయం ఆలస్యమవ్వడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే! గతంలో బాధితుల పక్షాన ప్రజలు భారీఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసన తెలపడం వల్ల మాత్రమే వ్యవస్థలో కదలిక వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

జెస్సికాలాల్ హత్య కేసు (1999) -- మను శర్మ ఈ కేసు భారత న్యాయ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైనది. ఒక కేంద్రమంత్రి కుమారుడైన మను శర్మ డ్రింక్ ఇవ్వలేదనే కారణంతో జెస్సికాలాల్ అనే యువతిని కాల్చి చంపాడు. కానీ రాజకీయ ఒత్తిళ్లతో సాక్షులు వెనక్కి తగ్గడంతో 2006లో నిందితుడు నిర్దోషిగా విడుదలయ్యాడు. అప్పుడు ప్రజలు, మీడియా కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేశారు. దీనివల్ల కేసును మళ్లీ విచారించి, మనుశర్మకు జీవిత ఖైదు శిక్ష విధించారు. రికార్డు స్థాయిలో వేగంగా విచారణ జరగింది కనుక.... ప్రియదర్శిని మట్టూ కేసు (1996)– సంతోష్‌కుమార్‌సింగ్.. ఒక ఐపీఎస్ అధికారి కుమారుడు తనను వేధిస్తున్నాడని ప్రి యదర్శిని మట్టూ అనేకసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. చివరకు ఆమె దారుణ హత్యకు గురైంది. కింది కోర్టు నిందితుడిని వదిలేసినప్పటికీ, సామాజిక ఒత్తిడి, సీబీఐ పట్టుదల వల్ల ఢిల్లీ హైకోర్టు అతనికి మరణశిక్ష విధించింది (తర్వాత అది జీవిత ఖైదుగా మారింది). ఈ కేసు ద్వారా చట్ట వ్యవ స్థ మీద ప్రభావం పడే వ్యక్తుల పిల్లలు కూడా చట్టానికి అతీతులు కారు అనే సందేశం సమాజంలోకి వెళ్లింది. నిర్భయ ఘటన (2012) తో చట్టాల్లో సమూల మార్పులు జరిగాయి. ఢిల్లీలో జరిగిన ఈ పాశవిక ఘటన దేశవ్యాప్త నిరసనలకు దారితీసింది. నిందితుల్లో ఒకరు మైనర్ (జువైనల్) కావడంతో తక్కువ శిక్షతో బయటపడటం పెద్ద వివాదానికి కారణమైంది. ప్రభుత్వం జస్టిస్ వర్మ కమిటీని నియమించింది. దీని ఫలితంగా 2013లో క్రిమినల్ లా (అమెండ్‌మెంట్) యాక్ట్ వచ్చింది. అత్యాచారానికి కఠిన శిక్షలు, వేధింపులు, యాసిడ్ దాడులపై కొత్త సెక్షన్లు చేర్చారు. అలాగే, 16-18 ఏండ్ల మధ్య ఉన్న వారు ఘోరమైన నేరాలకు పాల్పడితే వారిని పెద్ద' గానే పరిగణించాలని జువైనల్ చట్టాన్ని సవరించారు. మరో కేస్ ఉన్నావ్ (2017), హాథ్రస్ (2020) ఘటనల్లో నిందితులుగా ఉన్నారు. ఇక్కడ నిందితులు, రాజకీయ పలుకుబడి ఉన్నవారు. కుల్దీప్‌సింగ్ సెంగార్ -- మాజీ ఎమ్మెల్యే. బాధితుల కుటుంబాలపై దాడులు జరిగినా, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని కేసులను రాష్ట్రం దాటించి ఢిల్లీలో విచారణ జరిపించింది. నిందితుడికి జీవిత ఖైదు పడటంతో పాటు, ఆ రాజకీయ పార్టీ అతన్ని బహిష్కరించాల్సి వచ్చింది. జీరో ఎఫ్ఐఆర్ అంటే నేరం ఎక్కడ జరిగినా, ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా కేసు నమోదు చేయవచ్చు. పరిధి పేరుతో పోలీసులు తప్పించుకోలేరు. ప్రత్యేకంగా మహిళలపై జరిగే నేరాల కోసం వీటిని ఏర్పాటు చేశారు. పోక్సో చట్టం మైనర్లపై జరిగే లైంగిక వేధింపులకు కఠిన శిక్షలు అమలులోకి వచ్చాయి. బడాబాబులు కేసులను అణచివేయాలని చూసినా విషయాన్ని సోషల్ మీడియా ప్రజల్లోకి తీసుకెళ్తువ్యవస్థపై ఒత్తిడి పెంచటం సాధ్యమవుతున్నది. చట్టాలు ఎన్ని ఉన్నా, అమలు చేసే చోట అధికార గర్వం అడ్డుపడుతూనే ఉన్నది. దీనికి ప్రధాన పరిష్కారం. సత్వర న్యాయం అనేది కేవలం బాధితులకు ఊరట మాత్రమే కాదు, నేరస్థులకు ఒక బలమైన హెచ్చరిక. మన దేశంలో న్యాయం ఆలస్యమవ్వడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే అనే మాట ఎప్పుడూ వినిపిస్తున్నది. ఈ పరిస్థితి మారి, వేగంగా న్యాయం జరగాలంటే ఈ సమూల మార్పులు రావాలి. పోలీస్, దర్యాప్తు వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలి. న్యాయం ఆలస్యం కావడానికి మొదటి కారణం దర్యాప్తులో జాప్యం. పోలీసులకు బందోబస్తు పనులు, విచారణ పనులు వేర్వేరుగా ఉండాలి. దర్యాప్తు చేసే అధికారులకు ప్రత్యేక శిక్షణ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండాలి. నేరం జరిగిన నిర్ణీత కాలంలోనే పక్కా ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేయడం తప్పనిసరి. పోలీస్ వ్యవస్థ స్వతంత్రంగా పనిచేసేలా ఉండాలి! వారిపై రాజకీయ ఒత్తిడులుండకూడదు. న్యాయవ్యవస్థలో మౌలిక మార్పులు చేయాలి. కేసులు ఏళ్ల తరబడి సాగకూడదు. వాయిదాల సంస్కృతికి స్వస్తి చెప్పాలి. చిన్న కారణాలతో లాయర్లు వాయిదాలను కోరకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలి. బాధితులు, సాక్షుల రక్షణ లేక బడా బాబులు సాక్షులను బెదిరించడం వల్ల కేసులు వీగిపోతుంటాయి. సత్వర న్యాయం అనేది కేవలం కోర్టుల బాధ్యత మాత్రమే కాదు, సమాజం కూడా బాధితుల పక్షాన నిలబడాలి. నిర్భయ ఘటనలో జరిగినట్లుగా ప్రజల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు వ్యవస్థలు వేగంగా స్పందిస్తాయి. చట్టం ముందు అందరూ సమానులే అనే భావన వస్తేనే సామాన్యుడికి భరోసా కలుగుతుంది.

# నమ్మి నానవోస్తే పుచ్చిబుర్రలైనట్టు!

అవ్.. అన్నా.. హైదరాబాద్ బాగా డెవలప్ అయ్యింది. ఏం కావాలన్నా ఇక్కడే దొర్కుతాంది. బిహార్, లేదంటే ఇంకేదో రాష్ట్రానికో పోవాల్సిన అవసరం లేదు. వస్తారు, పని కానిచ్చేస్తారు, పోతారు. అంతే... ఇది ఓ సినిమాలో డైలాగ్. అవును. నిజంగానే భాగ్యనగరి మస్తు డెవలప్ అయ్యింది. దేశం తలతిప్పుకుని చూసే స్థాయి నుంచి తలతిప్పేందుకే భయపడే స్థాయికి ఎదిగింది. కేవలం రెండేండ్ల కాంగ్రెస్ పాలనలోనే రాజధాని మాత్రమే కాదు రాష్ట్రమే నేరాలకు అడ్డాగా మారింది. నేరాల్లో ఉత్తరాది రాష్ట్రాలతో తెలంగాణ పోటీ పడుతుండటం తలవంపే తప్ప మరేమీ కాదు. పింఛన్లు, బంగారం, రైతు భరోసా, మద్దతు ధర, బోనస్, జీరో కరెంట్ బిల్లు.. ఇలా ఏదైతేనేం కాంస్ ఇచ్చిన అన్ని హామీలు అటకెక్కినయ్. కాంగ్రెస్‌ను నమ్మిన పాపానికి అనుభవించాల్సి వస్తున్నది. అనుభవం పాఠాలు నేర్పుతుంది అనేది లోకోక్తి. రోజులు గడుస్తున్న కొద్దీ మెరుగుపడే అవకాశాలు అందిపుచ్చుకుంటారని కొందరు సమర్థించుకున్నారు. అలా చేస్తే వెరైటీ ఏముంది అనుకుంటున్నారో ఏమోగానీ రోజురోజుకు పాలన అధ్వానంగా, అసహ్యంగా తయారవు తున్నది. కొత్తగా ఏదైనా చేసి ముక్కున వేలేసుకునేలా చేస్తారనుకుంటే, ఇంతకన్నా చెత్తపనులు మనం చూడమేమో అన్నట్టుగా పనితనం చూపిస్తున్నారు. అధికారంలోకి వచ్చీరాగానే కాళేశ్వరం మీద పడ్డరు. ఎక్కడో పగుళ్లు అంటూ అంతా అటెన్షన్ అన్నట్టుగా జనాలను అటు తిప్పారు. పోయిన సర్కార్‌పై బురదజల్లేందుకు ఇష్టమొచ్చినట్టు మాట్లాడారు. సర్కార్ అనాలోచిత వైఖరితో కాళేశ్వరం ఖాళీ అయ్యింది, పంటలు ఏడ్పుముఖం పెట్టినయ్, రైతులు నేల చూపులు చూస్తున్నారు, అప్పులు ఆకాశానికి అంటినయ్, తీర్చే గత్యంతరం లేక దూలాలకు, చెట్లకు, పురుగుమందు డబ్బాలకు తమను తాము అర్పించుకుని మూల్యం చెల్లించుకుంటున్నారు. ప్రపంచమే అబ్బురపడిన చారిత్రక కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పాలకులు పూర్తి నిరుపయోగంగా మార్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇక రాష్ట్రంలో జరుగుతున్న క్రైమ్‌న భూతోన భవిష్యతి అన్నట్టుగా మరింత భయాందోళన కలిగిస్తున్నది. కేసీఆర్



పాలనలో వ్యవసాయానికి ఏ విధంగా ప్రాధాన్యత ఇచ్చారో, శాంతిభద్రతల పరిరక్షణకు అంతే ప్రాధాన్యత ఇచ్చారు. వినూత్న చర్యలు చేపట్టారు. నాడు పోలీసు వ్యవస్థ బలోపేతం కోసం కేసీఆర్ తీసుకున్న చర్యలను కూడా విమర్శించిన ప్రబుద్ధులను చూశాం. ఎందరు ఏమనుకున్నా బీఆర్ఎస్ సర్కార్ మాత్రం వెనక్కి తగ్గకుండా రాష్ట్రం శాంతివనంగా ఉంటేనే పెట్టుబడుల చెట్లు మహా వృక్షాలుగా ఎదుగుతాయని, ప్రజలు కంటినిండా కునుకు తీస్తారని నమ్మి తనపని తాను చేసుకుంటూ వెళ్లింది. పోలీసులకు కొత్త వాహనాలు, చిన్నచిన్న మండలాలకు కూడా పోలీస్ స్టేషన్లు, ఎప్పుడూ అందుబాటులో ఉండేలా ఎమర్జెన్సీ సర్వీసులు తీసుకొచ్చింది. రాజధాని హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను యావత్ భారతదేశమే అబ్బురపడేలా నిర్మించారు. నేరాలను అరికట్టి సత్ఫలితాలను చూపించారు. రేవంత్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో జరుగుతున్నది ఏంటి? ఎక్కడో మారుమూల గ్రామాలు, తండాలు మాత్రమే కాదు, మెట్రోపాలిటన్ నగరమైన హైదరాబాద్, రెండో రాజధాని వరంగల్‌లో నడిరోడ్డుపై పట్టపగలే జరిగిన ఘటనలను ఎలా అర్థం చేసుకోవాలి? ముఖ్యంగా వారం రోజుల కిందట హైదరాబాద్ నడిమధ్యలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్యను దుండగులు ఇంట్లోనే హత్య చేయడం చూస్తుంటే శాంతిభద్రతలు ఎంత అధ్వానంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. స్వయంగా ఓ మహిళా పోలీసు ఉన్నతాధికారి రాత్రిపూట రాజధాని వీధుల్లో మహిళలు ఎలాంటి చేదు అనుభవాన్ని ఎదుర్కొంటున్నారో ప్రత్యక్షంగా నిరూపించారు. ఇక ఆడపిల్లలు రోడ్లపై ధైర్యంగా నడిచేది ఎలా? రేవంత్ సర్కార్ ప్రజలకు భరోసా కల్పించడం దేవుడెరుగు మాకు ఇబ్బందులున్నాయి మహాప్రభో అని స్వయంగా మొరపెట్టుకుంటుంటే కూడా బాసటగా నిలిచే అవకాశాలు కనుచూపు మేరలో భూతద్దం పెట్టి వెతికినా కనిపించకుండా చేయడమే దయనీయం. ఇప్పుడు రాష్ట్రంలో నయా ట్రెండ్ క్రైమ్ నడుస్తున్నది. రోజుకో ఖూనీ, కొత్త రకం నేరాలు రాష్ట్రంలో అడ్డావేసి, వికటాట్టహాసం చేస్తున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ మైనర్‌పై అఘాయిత్యానికి పాల్పడ్డాడని కేసు నమోదైంది. కానీ నిందితుడు పరారీలో ఉంటే, రాష్ట్ర సర్కార్ అండగా నిలుస్తున్న తీరు యావత్ రాష్ట్రాన్ని నోటమాట రాకుండా చేస్తున్నది. నిందితుడికి ప్రభుత్వం బాసటగా నిలుస్తున్న పద్ధతిని ప్రజలంతా గమనిస్తున్నారు. బాధిత కుటుంబం న్యాయం చేయండి పెద్దలారా.. అని పోలీసులను వేడుకొంటే, నిందితుడిని అరెస్ట్ చేయడం కాదు కదా.. కనీసం ఆచూకీ కూడా కనిపెట్టకుండా చేస్తున్న జాప్యం అనుమానాలకు తావిస్తున్నది. రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుతో అనుమానాలకు బలం చేకూరుతున్నది. స్టేషన్ మెట్లు ఎక్కాలంటే బాధితులే భయపడేలా, నిందితులే కాలర్ ఎగరేసేలా వ్యవహరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కాంగ్రెస్ నేతలు అరచేతిలో వైకుంఠం చూపిస్తే, నోటికొచ్చిన హామీలు ఇస్తే ప్రజలు నమ్మి మోసపోయారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నా, పాలన సంతృప్తికరంగా సాగుతున్నా.. కాంగ్రెస్ ఇంకా ఏదో చేస్తామంటూ నమ్మబలికింది. ఒకటికి రెండు, రెండుకు నాలుగు ఇస్తామనేసరికి ప్రజలు బోల్తాపడ్డారు. నమ్మి నానవోస్తే పుచ్చి బుర్రలైనట్టు కాంగ్రెస్ బండారం బయటపడింది. రాష్ట్రానికి మరకలు, మచ్చలు అంటించే పని చేయడం తప్ప మరేమీ కనిపించడం లేదని జనం నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. చేతనైతే సాయంగా నిలవాలిగానీ, చేష్టలుడిగి చూస్తూ జీవితాలతో ఆడుకోవద్దని చెప్తున్నారు.

# బిజినెస్

# ప్రపంచ ఏఐ దిగ్గజంగా టీసీఎస్

భారతీయ ఐటీ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అతిపెద్ద ఏఐ ఆధారిత టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీగా అవతరించడమే తమ అంతిమ లక్ష్యమని దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రకటించింది. కంపెనీ వార్షిక నివేదిక (2025-26)లో భాగంగా వాటాదారులకు రాసిన లేఖలో టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె.కృతివాసన్ ఈ కీలక విషయాలను వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంతర్జాతీయ కార్పొరేట్ రంగంలో ఏఐ సాంకేతికతకు ఒక కీలక మలుపు అన్నారు. క్లయింట్లు కేవలం ప్రయోగాత్మక పైలట్ ప్రాజెక్టులకే పరిమితం కాకుండా తమ వ్యాపార సామ్రాజ్యాల్లో పెద్ద ఎత్తున ఏఐని విస్తరిస్తున్నారని స్పష్టం చేశారు. టీసీఎస్ గ్లోబల్ మార్కెట్‌లో తన పట్టును ఎంత బలంగా నిలుపుకుందో ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఏడాదికి 50 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయాన్ని అందించే కంపెనీ అగ్రశ్రేణి 139 క్లయింట్లలో.. ఏకంగా 130 మంది తమ ఏఐ సేవల భాగస్వామిగా టీసీఎస్‌ను ఎంచుకున్నారని కృతివాసన్ ప్రకటించారు. 'ఏఐ సృష్టిస్తున్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ-నేతృత్వంలోని టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీగా మారాలనే సాహసోపేతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. మౌలిక సదుపాయాలు నుంచి ఇంటెలిజెన్స్ వరకు ఫుల్ స్టాక్ ఏఐ సేవలను అందించడమే మా వ్యూహం' అని కృతివాసన్ చెప్పారు.

**మూడు రెట్లు పెరిగిన ఏఐ శ్రామిక శక్తి**

ఈ భారీ సాంకేతిక మార్పును తట్టుకునేందుకు వీలుగా టీసీఎస్ తన శ్రామిక శక్తిని దూకుడుగా సన్నద్ధం చేస్తోంది.




ప్రస్తుతం కంపెనీలో 2,70,000 మందికి పైగా ఉద్యోగులు అధునాతన ఏఐ నైపుణ్యాలను కలిగి ఉన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య ఏకంగా మూడు రెట్లు పెరగడం గమనార్హం.

**డిజిటల్ ప్రాజెక్టులు..**

గ్లోబల్ మార్కెటతోపాటు భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో టీసీఎస్ అత్యంత కీలక పాత్ర పోషించిందని సీఈఓ హైలైట్ చేశారు. గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్: రూ. 5 లక్షల కోట్లకు పైగా ప్రభుత్వ కొనుగోళ్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్‌గా దీనిని విస్తరించింది. ఎస్‌బీఐ యోనో 2.0: 10 భాషల్లో ఏకంగా 20 కోట్ల మంది వినియోగదారులకు అత్యంత వేగవంతమైన సేవలు అందించేలా దీనిని అప్‌గ్రేడ్ చేసింది. ఈ-పాస్‌పోర్ట్: కోటికి పైగా ఈ-పాస్‌పోర్ట్‌ల జారీతో పౌర సేవలను ఆధునీకరించింది. ఆర్‌బీఐ డేటా మేనేజ్‌మెంట్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక విశ్లేషణల కోసం 250 టీబీ డేటాను నిర్వహించగల అత్యాధునిక డేటా మేనేజ్మెంట్ సిస్టమ్‌ను నిర్మించింది.

## అంతర్జాతీయ మార్కెట్ల ఎఫెక్ట్.. దిగివస్తున్న బంగారం, వెండి ధరలు.. ఒక్కరోజే రూ15 వేలు తగ్గిన వెండి..!




అంతర్జాతీయ మార్కెట్లలోని పరిణామాల ప్రభావంతో దేశీయంగా బంగారం, వెండి ధరలు దిగివస్తున్నాయి. దేశీయ బులియన్ మార్కెట్‌లో ఇవాళ కూడా బంగారం, వెండి ధరలు నేలచూపులు చూశాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం లాంటి అంశాలు దేశంలో పసిడి, వెండి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఈ విలువైన లోహాల ధరలు మరోసారి భారీగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ అందించిన సమాచారం ప్రకారం.. ఇవాళ ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో ధరలు గణనీయంగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980 తగ్గి రూ.1,56,930కి పడిపోయింది. అదేవిధంగా 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.900 తగ్గి రూ.1,43,850 వద్ద స్థిరపడింది. బంగారం బాటలోనే వెండి ధర కూడా నడిచింది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధరపై ఏకంగా రూ.15,000 మేర పతనం నమోదైంది. ఈ భారీ తగ్గుదలతో ఇవాళ కిలో వెండి ధర రూ.2.9 లక్షలకు దిగివచ్చింది. గ్లోబల్ మార్కెట్‌లోని మార్పులే దేశీయంగా ధరల తగ్గుదలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఆ రాష్ట్రంలో క్యాబ్, బైక్ ట్యాక్సీలపై నిషేధం!




నగరాల్లో ఎక్కడికి వెళ్లాలన్నా.. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటివి బుక్ చేసుకుని వెళ్లిపోతుంటారు. అయితే మహారాష్ట్ర స్టేట్ గవర్నమెంట్ క్యాబ్, రైడ్ సేవలను నిలిపివేయాలని.. యాపిల్, గూగుల్ తమ యాప్ స్టోర్స్ నుంచి సంబంధిత యాప్స్ తొలగించాలని నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో అక్రమంగా బైక్, ట్యాక్సీ సేవలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన తరువాత ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. మహారాష్ట్రలో బైక్ ట్యాక్సీలు చట్టవిరుద్ధంగా నడుస్తున్నాయి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ సైబర్ విభాగానికి రాసిన లేఖలో వెల్లడించారు. ఆ కంపెనీల యజమానులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాపిడోకు అగ్రిగేటర్ లైసెన్స్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడంతో, 2022 చివరిలో బైక్ ట్యాక్సీలతో కొనసాగుతున్న వివాదం ప్రారంభమైంది. రాపిడో సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, జనవరి 2023 నాటికి అన్ని బైక్ ట్యాక్సీ సేవలు నిలిపివేశారు. చివరికి బైక్ ట్యాక్సీల కోసం ఒక అగ్రిగేటర్ విధానాన్ని రూపొందించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# 600 మీటర్ల దూరం.. అందుకే జాబ్ రిజెక్ట్!

ఈ మధ్యకాలంలో ఉద్యోగ నియామక ప్రక్రియలో విచిత్రమైన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగానే ఒక ఉద్యోగ అభ్యర్థికి వచ్చిన రిజెక్షన్ మెయిల్ అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా కంపెనీలు అభ్యర్థిని తిరస్కరించేటప్పుడు.. క్వాలిఫికేషన్, స్కిల్స్ వంటివి చూస్తాయి. తమకు అవసరమైన స్కిల్ ఉన్నవారిని ఎంపిక చేసుకుంటాయి. లేకుంటే రిజెక్ట్ చేస్తాయి. కానీ.. అభ్యర్థి పనిచేసిన పాత ఆఫీస్ 600 మీటర్ల దూరంలో ఉండటం వల్ల రిజెక్ట్ చేస్తున్నట్లు కంపెనీ మెయిల్ ద్వారా వెల్లడించింది. కంపెనీకి సంబంధించిన భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ కారణం చదివిన తరువాత చాలా మంది ఆశ్చర్యపోయారు. సాధారణంగా కంపెనీలలో గోప్యత అనేది ఉద్యోగి బాధ్యత. కాబట్టి దీనికి కొన్ని సెక్యూరిటీ పాలసీలు ఉంటాయి. కానీ.. కేవలం భౌగోళిక దూరం ఆధారంగా ఉద్యోగిని తిరస్కరించడం అనేది చాలా మందికి అర్థం కాని విషయం అయ్యింది. సోషల్ మీడియాలో ఈ పోస్ట్ వైరల్ అయిన తరువాత, చాలామంది వినియోగదారులు దీనిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు ఇది



పాతకాలపు ఆలోచన అని విమర్శించారు. నేటి డిజిటల్ ప్రపంచంలో సమాచారం ఎప్పుడైనా, ఎక్కడైనా చేరవచ్చు. కాబట్టి, కేవలం ఆఫీసుల మధ్య దూరం ఆధారంగా గోప్యత భంగం కలుగుతుందని భావించడం సరైనది కాదని అన్నారు.

# స్పోర్ట్స్

# కెప్టెన్‌గా ఫాతిమా సనా.. ఐదుగురికి తొలిసారి ప్రపంచకప్ ఛాన్స్!

పదో సీజన్ మహిళల పొట్టి వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. ముక్కోణపు సిరీస్‌ను, ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఫాతిమా సనా కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని సెలెక్టర్లు ఎంపిక చేశారు. సీనియర్లతో పాటు ప్రతిభావంతులైన జూనియర్లకు ప్రాధాన్యమిచ్చారు. అంతేకాదు రిజర్వ్ ప్లేయర్లుగా ఏకంగా ఆరుగురిని పాక్ బోర్డు తీసుకుంది. వన్డే ప్రపంచకప్‌లో పాక్‌ను నడిపించిన ఫాతిమా సనా పొట్టి కప్‌లోనూ కెప్టెన్‌గా ఎంపికైంది. సీనియర్లు మునీబా అలీ, అలియా రియాజ్, సదియా ఇక్బాల్, డయానా బైగ్, తస్మియా రుబబ్, తుబ హసన్‌లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. అండర్ -19 క్రికెట్‌లో అదరగొట్టిన ఇమన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సైరా జుబీన్‌లు మొదటిసారి ప్రపంచకప్ ఆడబోతున్నారు. ఈ పదిహేను మంది పోను.. ఆరుగురు రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపికయ్యారు.

**పాకిస్థాన్ స్క్వాడ్ :** ఫాతిమా సనా(కెప్టెన్), అలియా రియాజ్, అయేషా జఫర్, డయానా బైగ్, ఎమన్ ఫాతిమా, గుల్ ఫెరోజా, ఇరామ్ జవేద్, మునీబా అలీ(వికెట్ కీపర్), నష్రా సంధు, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సడియా ఇక్బాల్, సైరా జబీన్, తస్మియా రుబబ, తుబ హసన్.

రిజర్వ్ ప్లేయర్లు -- అంబర్ కైనత్, మొమినా రియాసత్, సడాఫ్ షమాస్, సిద్రా అమిన్, సైయదా అరూబ్, ఉమే హానీ.

జూన్ 12 నుంచి ఇంగ్లండ్ వేదికగా టీ20 వరల్డ్‌కప్



మొదలవ్వనుంది. అంతకంటే ముందు ఐర్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్ ముక్కోణపు సిరీస్‌లో తలపడనున్నాయి. ఈ మూడు జట్ల మధ్య డబ్లిన్‌లో మే 28 నుంచి జూన్ 4 వ తేదీ ఈ సిరీస్ జరుగనుంది. ప్రపంచకప్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ జూన్ 14న భారత జట్టును ఢీకొట్టనుంది. జూన్ 17న దక్షిణాఫ్రికాతో, జూన్ 20 వ తేదీన బంగ్లాదేశ్‌తో, జూన్ 23న ఆస్ట్రేలియా, జూన్ 27వ తేదీన నెదర్లాండ్స్‌తో పాక్ తలపడనుంది.

## కొంప ముంచిన ఆకాశ్ సింగ్!.. ఐపీఎల్‌లో వాటిపై నిషేధం?



చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ ఆకాశ్ మహరాజ్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసిన ఈ లెఫ్టార్మ్ ఫాస్ట్ బౌలర్.. 26 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు కూల్చాడు. తన అద్భుత స్పెల్‌తో చెన్నై టాపార్డర్‌ను ఆకాశ్ సింగ్ కుదేలు చేశాడు. ఓపెనర్లు సంజూ శాంసన్ (20), రుతురాజ్ గైక్వాడ్ (13).. వన్‌డౌన్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ (6)ను పెవిలియన్‌కు పంపి చెన్నైని నామమాత్రపు స్కోరు (187)కు పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, కీలక వికెట్లు తీసిన సంతోషంలో ఆకాశ్ సింగ్ సెలబ్రేషన్స్ చేసుకున్న తీరు క్రీడా వర్గాల్లో చర్చకు దారితీసింది. "అక్కీ ఆన్ ఫైర్.. టీ20 మ్యాచ్‌లో వికెట్లు ఎలా తీయాలో ఆకాశ్‌కు తెలుసు" అని రాసి ఉన్న నోట్ చూపించాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆకాశ్ సింగ్ చర్యపై విమర్శల వర్షం కురుస్తోంది. 'పేపర్ ట్రెండ్' మానుకుంటే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ అభిషేక్ శర్మ.. "ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం" అంటూ తన విధ్వంసకర ఇన్నింగ్స్‌ను అభిమానులకు అంకితమిస్తూ నోట్ చూపించాడు. అప్పటి నుంచి ఈ ట్రెండ్ మొదలైంది. ఇక ఇటీవల ముంబై ఇండియన్స్ బౌలర్ రఘు శర్మ సైతం ఇదే తరహాలో నోట్ చూపిస్తూ సెలబ్రేట్ చేసుకున్నాడు. గత మ్యాచ్‌లో చెన్నై స్టార్ ఉర్విల్ పటేల్ సైతం.. "ఈ ఇన్నింగ్స్ నీకోసమే నాన్నా" అని రాసి ఉన్న పేపర్ చూపించాడు. తాజాగా ఆకాశ్ ఇదే పనిచేశాడు. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ ఘాటుగా స్పందించాడు. "ఈ పేపర్లను పక్కనపెట్టాల్సిన సమయం వచ్చింది. ఇకపై ఇదేమీ ట్రెండ్ కాబోదు. నిజం చెప్పాలంటే గతంలోనూ దీనిని ట్రెండ్‌గానూ ఎవరూ గుర్తించలేదు" అని ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. ఇక భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఈఎస్‌పీఎన్‌క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ.. "అతడి అభివ్యక్తి అది. అయితే, చాలా మందికి ఇది నచ్చలేదు. ఇదొక రకంగా సరదాగా.. అదే సమయంలో చెత్తగా ఉంది.

## త్వరలో భారత్-పాక్ టెస్ట్ సిరీస్..?



క్రికెట్ అభిమానులకు శుభవార్త. భారత్-పాక్ మధ్య టెస్ట్ మ్యాచ్‌లు మళ్లీ మొదలుకానున్నాయని ప్రచారం జరుగుతుంది. ఈ దిశగా ఐసీసీ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. త్వరలో ఐసీసీ నిర్వహించబోయే కీలక సమావేశాల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ భవిష్యత్ నిర్మాణంపై చర్చించేందుకు ఐసీసీ ఈ నెలాఖర్లో (మే 30, 31) అహ్మదాబాద్‌లో బోర్డు సమావేశాలు నిర్వహించనుంది. ఈ సమావేశాల్లో టెస్టు క్రికెట్ విస్తరణతో పాటు భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక టెస్టు సిరీస్ పునరుద్ధరణ అంశం ప్రధాన చర్చగా మారే అవకాశముంది. ఈ సమావేశాలకు బీసీసీఐ, పీసీబీ అధ్యక్షులు హాజరవుతారు. పీసీబీ చీఫ్ నక్వీ ఈ మీటింగ్‌కు వర్చువల్‌గా అటెండ్ అవుతాడని తెలుస్తుంది. కాగా, భారత్, పాక్ మధ్య మళ్లీ టెస్టు సిరీస్ జరగొచ్చన్న చర్చ ఇరు దేశాల క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఇటీవల బంగ్లాదేశ్ పర్యటనలో నక్వీ మాట్లాడుతూ.. తదుపరి ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో అన్ని దేశాలతో టెస్టులు ఆడేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. దీంతో భారత్‌తో టెస్టు సిరీస్‌పై ఊహాగానాలు మరింత పెరిగాయి. భారత్, పాక్ చివరిసారిగా 2007-08లో టెస్టు సిరీస్ ఆడాయి. ఆ తర్వాత రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ద్వైపాక్షిక టెస్టు క్రికెట్ పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం ఐసీసీ సమావేశాల్లో దీనిపై ప్రత్యక్ష నిర్ణయం వచ్చే అవకాశం లేకపోయినా, భవిష్యత్ చర్చలకు ఇది బాటలు వేయొచ్చని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**12 జట్లు**

టెస్టు క్రికెట్ భవిష్యత్‌పై అధ్యయనం చేసేందుకు ఐసీసీ గతేడాదే మాజీ న్యూజిలాండ్ క్రికెటర్ రోజర్ ట్వోస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను ప్రస్తుతం ఉన్న 9 జట్ల నుంచి 12 జట్లకు విస్తరించాలని సూచించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే ఆఫ్ఘనిస్తాన్, జింబాబ్వే, ఐర్లాండ్ వంటి జట్లకు కూడా డబ్ల్యూటీసీలో చోటు దక్కే అవకాశం ఉంటుంది.

**ఒకే టెస్ట్‌తో సిరీస్**

ఈ సమావేశాల్లో ఒకే టెస్టుతో సిరీస్ నిర్వహించే ప్రతిపాదన కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రతి డబ్ల్యూటీసీ సిరీస్‌లో కనీసం రెండు టెస్టులు తప్పనిసరి. అయితే చిన్న క్రికెట్ బోర్డుల ఆర్థిక భారం తగ్గించేందుకు, మరిన్ని జట్లకు టెస్టు అవకాశాలు కల్పించేందుకు ఒకే టెస్టు సిరీస్ మోడల్‌పై ఐసీసీ ఆలోచిస్తున్నట్లు సమాచారం.

# వ్యూస్ కోసం దిగజారొద్దు.. జర్నలిస్టులకు మాళవిక మోహనన్ స్ట్రాంగ్ కౌంటర్



ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా మరియు జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని మరియు ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా మరియు వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్ మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.

# అనుపమ పరమేశ్వరన్ 'మరీచిక' ట్రైలర్ విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో విరాజ్ అశ్విన్, స్టార్ హీరోయిన్లు రెజీనా కాసాండ్రా, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మరీచిక' సతీష్ కాసెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా చిలకా ప్రోడక్షన్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, మేఘన చిలకా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సస్పెన్స్, లవ్ అండ్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే.. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'మ్యూజికల్ మాస్ట్రో' ఇళయరాజా సంగీతం అందించడం విశేషం. ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అద్భుతమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మే 29న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.




# కెనీషాతో బ్రేకప్.. మీడియా ముందు జయం రవి కన్నీటి పర్యంతం!




తమిళ స్టార్ హీరో జయం రవి (రవి మోహన్) మీడియా ముందు కన్నీళ్లుపెట్టుకున్నాడు. అతడి ప్రియురాలు పాప్ సింగర్ కెనీషా ఫ్రాన్సిస్ రవితో ఉన్న రిలేషన్‌షిప్‌కి బ్రేకప్ చెబుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. జయం రవి తన భార్య ఆర్తితో విడాకులు ప్రకటించిన రోజు నుంచి, ఈ విడాకులకు కెనీషానే కారణమంటూ సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్, ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే కెనీషాకు సోషల్ మీడియాలో తీవ్రమైన వేధింపులు, చంపేస్తామనే హత్యా బెదిరింపులు కూడా వచ్చాయి. ఈ వివాదాలపై తాజాగా కెనీషా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక సుదీర్ఘమైన ఎమోషనల్ పోస్ట్ పెడుతూ, తాను ఈ వ్యవహారం నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ వివాదాలు, ట్రోలింగ్స్ వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యానని, అందుకే చెన్నై నగరాన్ని సైతం వదిలి వెళ్లిపోతున్నట్లు ఆమె తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో మీడియా ముందుకు వచ్చిన నటుడు జయం రవి తీవ్ర ఆవేదనకు లోనై, కన్నీటి పర్యంతమయ్యారు. జయం రవి మీడియా ముందు మాట్లాడుతూ.. ఒక ప్రముఖ నటి తన జీవితాన్ని నాశనం చేసిందని ఆరోపించిన ఆయన, గత 14 ఏళ్ల వైవాహిక జీవితంలో తాను ఒక బానిసలా బతికానని ఆవేదన చెందారు. తాను కష్టపడి సంపాదించిన కోట్లాది రూపాయల ఆస్తులన్నీ భార్య వైపు వాళ్లే ఉంచుకున్నారని, కనీసం తన పేరు మీద ఒక్క బ్యాంక్ అకౌంట్ కూడా లేకుండా చేశారని, ప్రస్తుతం తాను అద్దె ఇంట్లో ఉంటున్నానని తెలిపారు. ఇల్లు వదిలి వచ్చేటప్పుడు తన చేతిలో ఏమీ లేదని, తన డబ్బును తన ఇష్టప్రకారం ఖర్చు పెట్టుకునే స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని చెప్పారు. సినిమాల్లో మహిళల హక్కుల గురించి మాట్లాడే తాను, మహిళలను ఎప్పుడూ తప్పుగా మాట్లాడనని, 45 ఏళ్ల వయసులో తాను అమ్మాయిల వెంట పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తనను అర్థం చేసుకుని తోడుగా నిలిచిన కెనీషాను కూడా టార్గెట్ చేసి పంపించేశారని మండిపడ్డారు. తన పిల్లల కోసమే తాను ఇన్నాళ్లూ బతికానని, కానీ ఇప్పుడు కనీసం తన పిల్లలను కూడా చూడనివ్వడం లేదని, వాళ్లను స్కూలుకు కూడా సెక్యూరిటీ గార్డుల కాపలాతో పంపుతున్నారని రవి మోహన్ తీవ్ర ఆక్రోశం వెళ్లగక్కారు. నా పిల్లల భవిష్యత్తు కోసమే ఇన్నాళ్లూ నోరు మూసుకుని ఉన్నానని.. నా వ్యక్తిగత జీవితాన్ని సరిదిద్దుకున్నాకే మళ్లీ సినిమాల్లోకి వస్తానని, అంతవరకు తాను నటించనని రవి స్పష్టం చేశారు. చివరగా రవి మోహన్ మాట్లాడుతూ 'మూడక్షరాల ఇడ్లీ నటి' ఒకరు తన జీవితాన్ని నాశనం చేశారని, ఆమె ఎన్ని కుటుంబాలను కూల్చిందో తాను చెప్పాలా అని నిలదీశారు. తాను అనుకుంటే ఒకే రోజులో విడాకులు తీసుకునేవాడినని, కానీ తన పిల్లల కోసమే ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నానని, ఇకపై నన్ను రెచ్చగొట్టవద్దంటూ మండిపడ్డారు. రవి మోహన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ పరిశ్రమలో తీవ్ర దుమారం రేపుతుండగా, ఆ 'మూడక్షరాల నటి' ఎవరనే దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

# స్టార్ హీరో సినిమాలో ఎన్టీఆర్ గెస్ట్ రోల్.. ఊహించని పాత్రలో తారక్..!!



ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ డ్రాగన్ (ప్రచారంలో ఉన్న పేరు) చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో కన్నడ భామ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. సాధారణంగా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఎప్పుడూ రకరకాల గాసిప్స్, క్రేజీ కాంబినేషన్ల గురించిన వార్తలు చక్కర్లు కొడుతూనే ఉంటాయి. తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో విపరీతమైన హల్‌చల్ సృష్టిస్తున్న ఒక వార్త నందమూరి, మాస్ మహారాజా అభిమానులను ఎంతగానో ఆకర్షిస్తోంది. మాస్ మహారాజా రవితేజ హీరోగా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' (ఆ77). ఇదివరకే ఈ మూవీపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన ఒక సంచలన గాసిప్ ఇప్పుడు టాలీవుడ్ 'గాసిప్ గ్యారేజ్'లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో అత్యంత కీలకమైన, దైవిక ప్రాధాన్యత కలిగిన అయ్యప్ప స్వామి పాత్రలో గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ (చీ=) గెస్ట్ రోల్‌లో కనిపించబోతున్నారనే ప్రచారం గట్టిగా సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. కానీ ఫిల్మ్ వర్గాల్లో ఈ న్యూస్ మాత్రం హల్చల్ చేస్తుంది. ఇటీవలే విడుదలైన 'ఇరుముడి' ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. రవితేజ ఇందులో నల్లటి దుస్తులు ధరించి, మెడలో మాల వేసుకుని భక్తిభావంతో ఉన్న ఒక పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తుడిగా (స్వామి మాలధారిగా) కనిపిస్తున్నారు. ఒకవైపు భక్తి, మరోవైపు తండ్రి-కూతుళ్ల మధ్య సాగే ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమాను శివ నిర్వాణ మలుస్తున్నారు. కథ ప్రకారం చిత్రంలో ఒక ప్రత్యేక సన్నివేశంలో గానీ, లేదా క్లైమాక్స్ వైపు వెళ్లే క్రమంలో గానీ అయ్యప్ప స్వామి వారి దివ్య రూపం లేదా దైవికమైన ఎపిసోడ్ ఒకటి ఉంటుందని తెలుస్తోంది. ఈ పాత్ర కేవలం కొన్ని నిమిషాల పాటే ఉన్నప్పటికీ, సినిమా మొత్తాన్ని ఒక ఊపు ఊపేసేలా ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. ఈ పాత్రకు ఎవరైనా పెద్ద స్టార్ హీరో అయితేనే న్యాయం జరుగుతుందని భావించిన చిత్ర బృందం, జూనియర్ ఎన్టీఆర్ పేరును పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఎన్టీఆర్ గతంలో నిజ జీవితంలో కూడా పలుమార్లు అయ్యప్ప దీక్షను ఎంతో నిష్ఠతో తీసుకున్నారు. ఆయన గంభీరమైన వాయిస్, నటనలోని దైవిక తీక్షణత ఈ పాత్రకు నూటికి నూరు పాళ్ళు సరిపోతాయని దర్శకుడు భావిస్తున్నట్లు సమాచారం. రవితేజ , జూనియర్ ఎన్టీఆర్ మధ్య రియల్ లైఫ్‌లో ఎంతో మంచి స్నేహబంధం ఉంది. ఒకవేళ ఈ వార్త కనుక నిజమైతే, వీరిద్దరి కాంబినేషన్‌ను ఒకే స్క్రీన్‌పై చూడటం అభిమానులకు పూనకాలు తెప్పించే విషయమే అవుతుంది. ముఖ్యంగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థతో ఎన్టీఆర్‌కు ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఈ క్యామియో రోల్ నిజమయ్యే అవకాశాలు ఉన్నాయంటూ నెటిజన్లు లెక్కలు వేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్, 'అయ్యప్ప' పాత్రపై చిత్ర యూనిట్ గానీ, లేదా జూనియర్ ఎన్టీఆర్ టీమ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇది కేవలం చర్చల దశలోనే ఉందా లేదా కేవలం పుకారు మాత్రమేనా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# జస్ట్ వావ్.. 'పెద్ది' ట్రైలర్‌పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' (గ్రావసంఆ). ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. కాగా, ఈ చిత్రం మే 18న విడుదల కాబోతున్న ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి ముందే వీక్షించారు. ట్రైలర్ చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, చిత్ర యూనిట్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ట్రైలర్ గురించి చిరంజీవి ట్వీట్ చేస్తూ.. ఇప్పుడే పెద్ది ట్రైలర్ చూశాను, జస్ట్ వావ్ అంతే! 3 నిమిషాల పాటు సాగిన ఈ ట్రైలర్ ప్యూర్ పవర్ ప్యాక్డ్‌గా ఉంది. చరణ్, బుచ్చిబాబు, రెహమాన్.. ఇలా ఒక్కొక్కరు తమ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. అందరూ కలిసి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేశారు. ఈ సినిమా గురించి మనం ఎంత ఊహించుకున్నా, ఈ ట్రైలర్ దాన్ని మించి ఉంటుంది. ఇందులో ఎమోషన్, ఎలివేషన్, మ్యాడ్నెస్ అన్నీ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి అని చిరు కొనియాడారు. ఎప్పటికప్పుడు తన సినిమాలకు లేదా చరణ్ సినిమాలకు సంబంధించిన ఆసక్తికర విషయాలను లీక్ చేస్తూ అభిమానులను అలరించే చిరంజీవి, ఈసారి కూడా తన అలవాటును రిపీట్ చేశారు. "చాలా రోజులయ్యింది మీకు 'చిరు లీక్స్' ఇచ్చి" అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తూ, పెద్ది ట్రైలర్‌లోని ఒక పవర్‌ఫుల్ డైలాగ్‌ను ఆయన లీక్ చేశారు. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు... నేను పోరాడాను సారు.. అంటూ ట్రైలర్‌లోని ఈ డైలాగ్ ఎంతో అద్భుతంగా ఉందంటూ మెగాస్టార్ ప్రశంసించారు. ఈ క్రమంలోనే దర్శకుడు బుచ్చిబాబుకు క్షమాపణలు చెబుతూ.. "సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పి లీక్ చేయాల్సి వచ్చింది" అంటూ చిరంజీవి చమత్కరించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం యొక్క ట్రైలర్ మే 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగాస్టార్ స్వయంగా ఇచ్చిన ఈ రివ్యూతో మెగా అభిమానుల్లో, సినీ ప్రేక్షకుల్లో 'పెద్ది' ట్రైలర్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి.

Printed, Published & Owned by V. SAI KRISHNAREDDY, Printed at SAI KRISHNA PRINTERS, Door No. 7-7-86/1, Near Collector Chowk, Adilabad (T.S) 504001 Published at H.No. 1-2-125/1, Pithruchaya Nilayam, Shanti Nagar, Adilabad-504001 (T.S) Editor: V. SAI KRISHNA REDDY, RNINO. TELTEL/2012/44706, CELL:7073352171, Email: akshararekhadaily@gmail.com